ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు

NO SMOKING ALCOHOL
SAY NO TO DRUGS

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 65 బుధవారం 18 - 02 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in VOLUME : 01 Issue : 65 Wednesday 18 - 02 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

# త్వరలో ప్రతి జోన్‌లో పర్యటిస్తా

- రోడ్లు శుభ్రంగా లేకుంటే అధికారులపై చర్యలు తీసుకుంటా
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి
- జీహెచ్ఎంసీ విభజనలో తలెత్తిన సమస్యల పరిష్కారాలపై పలు సూచనలు చేసిన సీఎం
- హైదరాబాద్‌లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటుపై అధ్యయనం
- ప్రకటన బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు
- ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10 శాతం ప్రకటన బోర్డులు కేటాయించాలని తెలిపారు



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 17 :** హైదరాబాద్‌లోని పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. జీహెచ్ఎంసీ విభజనలో తలెత్తిన సమస్యల పరిష్కారాలు సూచించారు. సీఎస్, సీఎంవో సెక్రటరీ, హెచ్ఎండీఏ కమిషనర్‌తో కలిసి సీఎం సమీక్ష జరిపారు. పీపీపీ విధానంలో నిర్మాణాలు : హైదరాబాద్‌లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ఆయన సీఎం ఆదేశించారు. ట్రాఫిక్ అధికంగా ఉన్న చోట స్కైవాక్ బ్రిడ్జిలు నిర్మించాలని సూచించారు. అవసరమైన చోట పీపీపీ విధానంలో స్కైవాక్‌లు నిర్మించాలని తెలిపారు. నెక్లెస్‌రోడ్ రైల్వేస్టేషన్ వద్ద మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆదాయానికి గండి పడకుండా చర్యలు : ప్రకటన బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన - మిగతా 2 లో

## భారత్‌తోనే కాదు ప్రపంచ అగ్రగామి క్లస్టర్లతో పోటీపడుతున్నాం



- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైదరాబాద్ హైటెక్స్‌లో బయో ఆసియా సదస్సును ప్రారంభించిన సీఎం రేవంత్
- లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగ నిపుణులను సత్కరించిన సీఎం
- జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును బ్రూస్ లెవిన్‌కు అందించిన రేవంత్‌రెడ్డి

**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 17 :** రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. 23 సంవత్సరాల క్రితం బయో ఆసియా ప్రారంభమైనప్పుడు హైదరాబాద్ అంటే చార్మినార్, బిర్యానీ, ఔషధ తయారీ, సాఫ్ట్‌వేర్ నగరం అన్న గుర్తింపు ఉండేదని, ప్రస్తుతం - మిగతా 2 లో



2 లో

హైదరాబాదులో అక్రమంగా నివసిస్తున్న

## 23 మంది విదేశీయుల అరెస్ట్

- హైదరాబాద్ టోలిచౌకిలో పోలీసుల భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్
- వీసా గడువు ముగిసి అక్రమంగా నివసిస్తున్న 23 మంది విదేశీయుల అరెస్ట్
- 250 మంది పోలీసులతో పారామౌంట్ కాలనీ, ఐఏఎస్ కాలనీలో సోదాలు
- పత్రాలు లేని 30 బైక్‌లు, అక్రమ మద్యం, గ్యాస్ సిలిండర్లు స్వాధీనం
- నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించిన పోలీసులు

## ఎవరెస్టుపైకి వెళ్లగలిగే హెలికాప్టర్ తయారు చేస్తాం



2 లో

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ఫ్రాన్స్ సహాయంతో ఎవరెస్టుపైకి వెళ్లగలిగే హెలికాప్టర్ తయారు చేస్తాం
- భారత్‌లో తయారయ్యే హెలికాప్టర్లు ప్రపంచమంతా ఎగుమతి అవుతాయి
- క్లీన్ ఎనర్జీ, స్పేస్ వంటి రంగాల్లో భారత్, ఫ్రాన్స్ కలిసి పనిచేస్తాయి
- ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తో భేటీలో మోదీ



2 లో

## ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్!

- స్పేస్ ఎక్స్ అధినేత ప్రస్తుత ఆస్తులు 850 బిలియన్ డాలర్లు
- 'స్పేస్ ఎక్స్ ఎక్స్ ఏఐ' డీల్ కుదిరితే భారీగా పెరగనున్న మస్క్ సంపద
- ఈ ఏడాది మస్క్ ట్రిలియనీర్‌గా మారే అవకాశం 75 శాతం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాలు

## బంగ్లాదేశ్‌కు 35 ఏళ్ల తర్వాత

# పురుష ప్రధాని

- ప్రమాణస్వీకారం చేసిన తారిక్ రెహమాన్
- బంగ్లాదేశ్ 11వ ప్రధానిగా తారిక్ రెహమాన్ ప్రమాణ స్వీకారం
- రాజ్యాంగ సంస్కరణల మండలి ప్రమాణంపై బీఎన్‌పీ ఎంపీల నిరాకరణ
- ఎంపీలతో తొలిసారిగా ప్రమాణం చేయించిన ప్రధాన ఎన్నికల కమిషనర్
- నూతన ప్రభుత్వం ముందు ఇస్లామిక్ తీవ్రవాదాన్ని అరికట్టే సవాలు



**వార్త సంధ్య, ఢిల్లీ, ఫిబ్రవరి 17 :** బంగ్లాదేశ్‌లో కొత్త రాజకీయ అధ్యాయం మొదలైంది. దేశ 11వ ప్రధానమంత్రిగా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్ తారిక్ రెహ్మాన్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన 13వ పార్లమెంటరీ ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం సాధించడంతో ఆయన ప్రధాని పీఠాన్ని అధిష్టించారు. దాదాపు 35 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బంగ్లాదేశ్‌కు ఒక పురుషుడు ప్రధాని కావడం విశేషం. ఢాకాలోని జాతీయ పార్లమెంట్ సౌత్ ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్, తారిక్ రెహ్మాన్‌తో ప్రమాణం చేయించారు. ఆయనతో పాటు 50 మంది సభ్యుల మంత్రివర్గం - మిగతా 2 లో



2 లో

## మండలిలో అచ్చెన్నాయుడు ఫైర్

- వైసీపీ నేతల్లారా... సిగ్గుపడండి!
- లడ్డూ కల్తీని నాటి టీటీడీ ఛైర్మనే ఒప్పుకున్నారన్న అచ్చెన్న
- వైసీపీ నేతలు సిగ్గులేకుండా ఎదురుదాడి చేస్తున్నారని విమర్శ
- హెరిటేజ్‌పై ఆరోపణలకు దమ్ముంటే సభలో
- ఆధారాలు చూపాలని సవాల్
- జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించిన మంత్రి
- తప్పు చేసిన వారు శిక్ష అనుభవిస్తారని హెచ్చరిక

## వన్ క్లాస్ - వన్ టీచర్ పాఠశాలలను

# 33 శాతానికి పెంచాం

- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్
- గత ప్రభుత్వం తెచ్చిన ఆ జీవో పిల్లలను స్కూళ్లకు దూరం చేసింది
- వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో 117తో ప్రభుత్వ స్కూళ్లకు దూరమయ్యారన్న మంత్రి
- వన్ క్లాస్ - వన్ టీచర్ పాఠశాలలను 33 శాతానికి పెంచామన్న నారా లోకేశ్
- రూ.1000 కోట్లతో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని వెల్లడి
- గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం చేపట్టిన తర్వాత కూడా 233 పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఏర్పడిందని మంత్రి లోకేశ్ అన్నారు



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 17 :** గత ప్రభుత్వం 2019-24 సమయంలో జీవో 117 తీసుకురావడంతో పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని, ఈ క్రమంలో ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రజాప్రభుత్వం వచ్చాక ఆ జీవోను రద్దు చేశామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ, గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం చేపట్టిన తర్వాత కూడా 233 పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అంతేకాకుండా పాఠశాల విద్యాభివృద్ధిలో వన్ క్లాస్ - వన్ టీచర్ విధానం చాలా కీలకమైందని, గతంలో 3 శాతం పాఠశాలల్లో మాత్రమే వన్ క్లాస్ - వన్ టీచర్ ఉంటే, ఇప్పుడు 33 శాతానికి పెంచామని అన్నారు. దీనిద్వారా పిల్లలకు మెరుగైన విద్య - మిగతా 2 లో

## విశాఖపట్నం చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



2 లో

- విశాఖలో రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం పలికిన గవర్నర్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష-2026లో ముఖ్య అతిథిగా హాజరు
- నగరంలో కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు
- మిలన్ పరేడ్‌తో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న రాష్ట్రపతి

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# సంపాదకీయం

## పులిని బతకనివ్వండి!



రక్తం మరిగిన పులి.. క్రూరంగా ప్రవర్తిస్తున్న పులి.. మనుషుల వెంట పడుతున్న పులి.. పశువులను చంపుతున్న పులి.. ప్రమాదకారిగా మారిన పులి... ఇలా రకరకాల పదాలు మనకీమధ్య సోషల్ మీడియాలో బాగా వినిపిస్తున్నాయి. ఈ పదాల వెనక ఎంత వాస్తవం ఉంది? ఒక కుక్కను చంపాలనుకున్నప్పుడు దాన్ని పిచ్చిదని ముద్ర వేస్తే చంపడం సులభమవుతుంది. పెద్దపులి పరిస్థితి కూడా ఇలాగే తయారైందనిపిస్తున్నది. వాటి ఆవాసాలు ధ్వంసమైపోయి అడివంటూ మిగలక పోయేసరికి దిక్కుతోచక వందల కిలోమీటర్లు నడిచి, తలదాచుకునే చోటు కోసం వెతుక్కుంటూ వస్తున్నాయి. తినడానికి తిండి లేక కాలే కడుపుతో అడవిని వెతుక్కుంటూ గ్రామాల వైపు నడిచి వస్తున్నాయి. వాటి ప్రయాణం మధ్యలో తగిలే జనావాసాలు, పంట పొలాలు, మానవ సంచారం... వాటిని మరింత ఆందోళనకు, భయానికి గురిచేస్తున్నాయి.మనిషి శాకాహారం తినగలిగి కూడా రోజూ కోట్ల కొద్దీ కోళ్లు, మేకలను తన ఆహారం కోసం హతమారుస్తున్నాడు. మాంసాహార జీవి అయిన పెద్దపులి మాత్రం ఏం చేస్తుంది?! ఆకలి తీర్చుకోవడానికి, తనకు ఎదురైన జంతువులను వేటాడుతున్నది. తిరిగి తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నది. మనిషి తనకు హఠాత్తుగా ఎదురుపడితేనో లేదా తనకు హాని చేయజూస్తేనో ఆత్మరక్షణార్థం ఎదురు దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నది. రోజురోజుకూ అటవీ విస్తీర్ణం తగ్గిపోతుంటే, అడవులన్నీ పోడుగా మారిపోతుంటే, వేటగాళ్లు అడవిలో ఉచ్చులు పెట్టి విచ్చలవిడిగా అటవీ ప్రాణుల్ని చంపి తింటుంటే పులులకు తినడానికి తిండి లేక సంచారం మొదలుపెట్టాయి. ఆహార పిరమిడ్‌లో పై భాగంలో పులి ఉంటుంది, అది బతికితేనే అడవి చల్లగా ఉంటుంది, అడవిలో సమతుల్యత ఉంటుంది. పర్యావరణం నిలబడుతుంది. అలాంటి అడవుల్ని రోజురోజుకూ ధ్వంసం చేస్తూ కొంత మంది ఆ భూముల్ని ఆక్రమిస్తుంటే ఒక మంత్రేమో, ఆ భూములకు పట్టాలిస్తాను అంటాడు! అటవీ శాఖ మంత్రేమో అడవులు నరక వద్దంటాడు. ఒకే ప్రభుత్వంలో ద్వంద్వ వైఖరి ఇది. మనం తరచూ చూస్తున్న చోద్యమే!మహారాష్ట్రలోని తడోబా, ముఖ్యంగా తిప్పేశ్వర్ అటవీ ప్రాంతాల వరకు మనం వెళ్లి చూడగలిగితే అక్కడ పెరుగుతున్న రిసార్టులతో పాటు గ్రామాలకు గ్రామాలే అడవిని ఆక్రమిస్తున్న వైనం మనకు కనిపిస్తుంది. తిప్పేశ్వర్ కేవలం 150 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న చిన్న అడవి. అక్కడ ఈ పెద్దపులులు తలదాచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. నానాటికీ కుంచించుకుపోతున్న అడవితో వాటికి నిలువనీడ లేక ప్రాదేశిక తగాదాలతో వాటిలో అవి పోరాటాలు చేసి, ఓడిన పులులు తాము తల దాచుకునే స్థలం కోసం వలసబాట పడుతున్నాయి. వందల కిలోమీటర్లు ప్రయాణించినా అవి బతకడానికి అడవంటూ మిగిలితే కదా! ఒక పులి 600 కిలోమీటర్లు ప్రయాణించి రాజమండ్రి పరిసరాలకు చేరుకున్న వైనం మీరు వినే ఉంటారు! సురక్షితంగా మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఆ పులిని విశాఖ జూకు తరలించిన విషయం విని సంతోషించాను. ఎందుకంటే దాన్ని రక్తం మరిగిన పులి అనో.. ప్రమాదకారి అనో ముద్ర వేసి చంపలేదు.ఇప్పుడు పడుతున్న ఆందోళన అంతా జనగామ, సిద్దిపేట ప్రాంతాల్లో తిరుగుతున్న పులి గురించి. దానినే ఇష్టం వచ్చినట్టు సోషల్ మీడియాలో ప్రమాదకారి అని, రక్తం మరిగిన పులి అని రకరకాలుగా ఆకతాయితనంతో దుష్ప్రచారం చేస్తున్నారు. ఒకసారి ఆ పులిని ప్రమాదకారిగానో లేదా మనుషుల్ని తినేదిగానో ముద్ర వేస్తే దాని కథ ముగిసిపోయినట్టే! మత్తు తూటాతో నిద్రపుచ్చి పెద్దపులిని సంరక్షించాల్సిన చేతులే, దాన్ని పట్టుకోవడం మా వల్ల కాదు అని చేతులెత్తేస్తే... రేపు జరగబోయేది ఇదే!ఈ మధ్య మహారాష్ట్ర అసెంబ్లీలోనైతే ఒక మంత్రి చిరుత పులి వేషంలో వచ్చి, 'అవి జన జీవనానికి ఆటంకం కలిగిస్తున్నాయి, వాటిని చంపేయండి' అని బహిరంగంగా అనడం ఆందోళనకరం. నిజంగా వాటిపై ఏదో ఒక ముద్ర వేసి చంపే హక్కు మనిషికి ఉందా? ఈ భూమిపై ప్రతి ప్రాణికి మనిషితో సమానంగా బతికే హక్కు ఉంది. కానీ మనిషి ఏదో ఒక ముద్ర వేసి వాటిని చంపజూడడం ఎంతవరకు న్యాయం? వాటి నోటికాడి కూడు లాగేసుకుంటూ వాటి ఆవాసాలను ధ్వంసం చేశాక ఆ అసహాయ జీవులు మాత్రం ఏం చేస్తాయి? వీధి కుక్కలు, కోతుల గురించి మాట్లాడే జంతు ప్రేమికుల గొంతు, పులి పట్ల ఎందుకు మూగబోయింది? కుక్కలు, కోతులు మాత్రమే జంతువులా? మనిషి వల్ల రోజూ అనేక రకాల జీవజాతులు శాశ్వతంగా కాలగర్భంలో కలిసిపోతున్నాయి.పులి ఠీవీకి, రాజసానికి, అందమైన మేని ఛాయకు పెట్టింది పేరు. అన్నిటికంటే ముఖ్యంగా స్వేచ్ఛకు ప్రతీక. దానిని జూలలో సంరక్షణ పేరిట బంధించకండి. స్వేచ్ఛగా అడవులలో తిరగనివ్వండి. పులి అడుగుల సవ్వడి వినిపించని అడవులు శ్మశానంతో సమానం. ఆ అందమైన జంతువును బతకనివ్వండి. అడవిని సంరక్షించాలని, జంతువుల్ని రక్షించాలని కలలు కని ఫారెస్ట్ ఆఫీసర్లుగా మారిన నిజాయితీ గల అటవీశాఖ ఉద్యోగులకు ఆయుధాలు ఇవ్వండి, అడవుల విస్తీర్ణాన్ని కాపాడండి. కవ్వాల్, నల్లమల అడవుల్లో పులిగర్జన వినిపించనీయండి!!

# వన్ క్లాస్ - వన్ టీచర్ పాఠశాలలను 33 శాతానికి పెంచాం

మొదటిపేజీ తరువాయి - అందడంతో పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి ప్రధానంగా 5 అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని అన్నారు.ప్రధానంగా లీక్ ప్రూఫ్ బిల్డింగ్, పెయింట్స్, బెంచీలు, టాయ్ లెట్స్, తాగునీరు అందించాలని నిర్ణయించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్ ఇచ్చామని, ఏపీలో 5 స్టార్ రేటింగ్ ఉన్నవి లేవని వెల్లడించారు. 40 శాతం 1, 2లో స్టార్‌లో ఉన్నాయని, అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 3, 4 స్టార్ రేటింగ్ కు తేవాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. పెండింగ్ వర్క్స్ పూర్తిచేయాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. ఎక్కడ తరగతి గదుల అవసరం ఉందో అక్కడ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని నిర్ణయించామని అన్నారు.ఎస్ఎంసీ ఎకౌంట్ లో రూ.200 కోట్ల నిధులు ఉన్నాయని, బడ్జెట్ లో రూ.800 కోట్లు అదనంగా కేటాయించారని అన్నారు. ఈ రెండు కలిపి వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక మౌలిక సదుపాయాలకు రూ.వెయ్యి కోట్లు ఖర్చుచేసే అవకాశం ఉందని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒక పద్ధతి ప్రకారం 5 స్టార్ రేటింగ్ తెచ్చే బాధ్యత ప్రజాప్రభుత్వం



తీసుకుంటుందని హామీ ఇచ్చారు. 2014-19 నడుమ చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, గత ప్రభుత్వం పాఠశాలల విషయంలో అస్తవ్యస్థ విధానాలు అవలంభించిందని అన్నారు. నాడు- నేడు పేరుతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. వాటి కారణంగా నేటికి కూడా అనేక చోట్ల అసంపూర్తి నిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలలో నూతన విద్యావిధానానికి శ్రీకారం చుట్టి, పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టుల నియామకం చేపట్టినట్లు తెలిపారు.మనబడి - మన భవిష్యత్ పేరిట పాఠశాలలను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతూ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భారీగా పెరుగుతోందని అన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలు, తరగతి గదులను సత్వరం పూర్తిచేయా ల్సిందిగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారని అన్నారు.2019 ఎన్నికలకు ముందు తిత్లీ తుపానులో ఎన్నో పాఠశాలలు దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. నాటి చంద్రబాబు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసినప్పటికీ, టీడీపీ సానుభూతిపరులు పనులు చేశారనే కారణంతో వైసీపీ ప్రభుత్వం వాటి బిల్లులు చెల్లించలేదని అన్నారు. గత ఐదేళ్లలో నాడు-నేడు అక్రమాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసంపూర్తిగా నిలచిపోయిన భవనాలు పూర్తి చేయాలని గౌతు శిరీష విజ్ఞప్తి చేశారు.

# బంగ్లాదేశ్‌కు 35 ఏళ్ల తర్వాత పురుష ప్రధాని

మొదటిపేజీ తరువాయి - కూడా ప్రమాణం చేసింది. ఈ కేబినెట్‌లో 25 మంది మంత్రులు, 24 మంది సహాయ మంత్రులు, ముగ్గురు టెక్నోక్రాట్‌లు ఉన్నారు. తొలిసారి ఎన్నికైన వారితో పాటు పలువురు కొత్త ముఖాలకు మంత్రివర్గంలో చోటు కల్పించారు.అంతకుముందు, పార్లమెంట్ సభ్యులుగా బీఎన్‌పీకి చెందిన 209 మంది ఎంపీలు ప్రమాణం చేశారు. అయితే, రాజ్యాంగ సంస్కరణల మండలి ప్రమాణ పత్రంపై సంతకాలు చేయడానికి పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు వారు నిరాకరించారు. తాము కౌన్సిల్ సభ్యులుగా ఎన్నిక కాలేదని, అందుకే ఆ ప్రమాణాన్ని స్వీకరించబోమని బీఎన్‌పీ నేత సలావుద్దీన్ అహ్మద్ స్పష్టం చేశారు.బీఎన్‌పీ వైఖరిని నిరసిస్తూ జమాత్-ఎ-ఇస్లామీ, ఇస్లామీ ఆందోళన్, నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సీపీ)లతో కూడిన 11 పార్టీల కూటమి తొలుత ప్రమాణ స్వీకారాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. అయితే, కొద్దిసేపటికే ఈ రాజకీయ డ్రామాకు తెరపడింది. జమాత్ నేతృత్వంలోని కూటమి, స్వతంత్రులు, ఇస్లామీ ఆందోళన్ బంగ్లాదేశ్, ఎన్‌సీపీ ఎంపీలు వేర్వేరుగా ప్రమాణం చేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఏఎంఎం నసీర్ ఉద్దీన్ కొత్తగా ఎన్నికైన ఎంపీలతో ప్రమాణం చేయించడం గమనార్హం.ఫిబ్రవరి 12న 299 పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీఎన్‌పీ 209 సీట్లు గెలుచుకోగా, రాడికల్ ఇస్లామిస్ట్ పార్టీ అయిన జమాత్-ఎ-ఇస్లామీ 68 స్థానాల్లో విజయం సాధించింది.



రెండు చోట్ల గెలిచిన తారిక్ రెహ్మాన్, బోగ్రా-6 స్థానాన్ని వదులుకుని, ఢాకా-17 ఎంపీగా ప్రమాణం చేశారు. గత 18 నెలలుగా మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వ హయాంలో పెరిగిన అశాంతి, ఇస్లామిక్ తీవ్రవాదాన్ని అరికట్టడం కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా నిలవనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.కాగా, ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా హాజరయ్యారు. బంగ్లాదేశ్ లో కొలువుదీరిన నూతన ప్రభుత్వానికి ఆయన భారత్ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్!

మొదటిపేజీ తరువాయి - టెక్ దిగ్గజం, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా ఉన్న ఆయన, అతి త్వరలోనే 'తొలి ట్రిలియనీర్' హోదాను దక్కించుకోనున్నారని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ముగిసేలోపే మస్క్ ఈ మైలురాయిని చేరుకునే అవకాశం ఉంది.

**సంపదలో అగ్రస్థానం..**

ప్రస్తుతం మస్క్ నికర ఆస్తుల విలువ 850 బిలియన్ డాలర్లకు చేరింది. ఫిబ్రవరి నాటికి 800 బిలియన్ డాలర్ల మార్కును దాటిన తొలి వ్యక్తిగా ఆయన రికార్డు సృష్టించారు. మస్క్ సంపద ఏ స్థాయిలో ఉందంటే.. ప్రపంచంలోని మరో ముగ్గురు అగ్రశ్రేణి కుబేరుల మొత్తం సంపద కంటే ఇది ఎక్కువ. లారీ పేజ్ (గూగుల్): 251 బిలియన్ డాలర్లు, సెర్గీ బ్రిన్ (గూగుల్): 231 బిలియన్ డాలర్లు, మార్క్ జుకర్‌బర్గ్ (మెటా): 219 బిలియన్ డాలర్లు.. ఈ ముగ్గురి



మొత్తం సంపద 701 బిలియన్ డాలర్లు కాగా మస్క్ ఒక్కరి సంపదే 850 బిలియన్ డాలర్లు కావడం విశేషం.

**ట్రిలియన్ మార్కుకు చేర్చే 'స్పేస్ ఎక్స్ ఎక్స్ ఏఐ' డీల్**

మస్క్ సంపద ఇంత వేగంగా పెరగడానికి ఇటీవల జరిగిన ఒక భారీ ఒప్పందమే ప్రధాన కారణం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఎక్స్ ఏఐని స్పేస్ ఎక్స్ 1.25 ట్రిలియన్ డాలర్లతో కొనుగోలు చేసింది. విలీనమైన ఈ కొత్త సంస్థలో మస్క్‌కు 43 శాతం వాటా ఉంది. దీని విలువ సుమారు 530 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం.

**మస్క్ ఆస్తుల విభజన**

స్పేస్ ఎక్స్/ ఎక్స్ ఏఐ వాటా: 530 బిలియన్ డాలర్లు

టెస్లా వాటా(12%): 178 బిలియన్ డాలర్లు

**త్వరలో 1.5 ట్రిలియన్ డాలర్లకు..**

ఈ ఏడాది మస్క్ ట్రిలియనీర్‌గా మారే అవకాశం 75 శాతం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. దీనికి అదనంగా త్వరలోనే స్పేస్ ఎక్స్ సంస్థ ఐపీఓ ద్వారా సుమారు 25 బిలియన్ డాలర్లను సమీకరించాలని భావిస్తోంది. ఈ ప్రక్రియ విజయవంతమైతే, మస్క్ నికర విలువ ఏకంగా 1.5 ట్రిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉంది.

# భారత్‌తోనే కాదు ప్రపంచ అగ్రగామి క్లస్టర్లతో పోటీపడుతున్నాం

మొదటిపేజీ తరువాయి - ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా మారిందని అన్నారు. హైదరాబాద్ హైటెక్స్ వేదికగా జరుగుతున్న బయో ఆసియా సదస్సును రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో పలు సంస్థలతో ఒప్పందాలు జరగనున్నాయి.

**తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ప్రకటించాం :** లైఫ్ సైన్సెస్, ఫార్మా, మెడ్ టెక్ రంగాల వేదిక అయిన బయో ఆసియా సదస్సు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైంది. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగంలో దేశ విదేశాలకు చెందిన సీఈఓలు శాస్త్రవేత్తలు, నిపుణులు సమ్మిట్‌లో పాల్గొన్నారు. ముందస్తు విజన్, ప్రభుత్వ పాలసీలతో రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. గత రెండు సంవత్సరాల్లోనే లైఫ్ సైన్సెస్ రంగంలో 73 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఇటీవల తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ప్రకటిం చామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం లక్ష్యమని, భారత్‌తోనే కాదు ప్రపంచ అగ్రగామి క్లస్టర్లతో పోటీపడుతున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఎదుగుదలలో మీరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు."హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా నిలిచింది. రెండేళ్లలో జీవవిజ్ఞాన రంగంలో రూ.73 వేల కోట్లకు పైగా పెట్టుబడులు. ఇటీవల దావోస్‌లో కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీ ప్రకటించాం. ప్రపంచస్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు 'వన్-బయో' ప్రారంభించాం. ఇటీవల తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ప్రకటించాం. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం లక్ష్యం. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టి జీసీసీలను స్థాపించాలి. ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, యువత మీ విజయ భాగస్వాములుగా ఉంటారు. హైదరాబాద్ ప్రపంచ జీవవిజ్ఞాన రాజధానిగా ఎదుగుతుంది."- రేవంత్ రెడ్డి, సీఎంప్రపంచ ఆరోగ్య భద్రతకు తెలంగాణ దోహదపడుతోందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మెడికల్ టూరిజం పాలసీతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తోందని, అతి తక్కువ ధరలతో అత్యాధునిక చికిత్సలు అందుతున్నందున 40 దేశాలకు పైగా ప్రజలు చికిత్స కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు."ఫార్మా రంగంలో హైదరాబాద్ అగ్రగామిగా ఉంది. హైదరాబాద్ కేంద్రంగా 14 బిలియన్ వ్యాక్సిన్ల ఉత్పత్తి. ప్రపంచ ఉత్పత్తిలో మూడో వంతు ఇక్కడే తయారవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య భద్రతకు తెలంగాణ దోహదపడుతోంది. తెలంగాణ బలం పరిశోధన, ఆవిష్కరణ కేంద్రాలకే పరిమితం కాదు. గ్లోబల్ హెల్త్ కేర్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ నిలుస్తోంది. సంక్లిష్ట హృద్రోగ, ఐవీఎఫ్, మోకీళ్ల మార్పిడి చికిత్సలు జరుగుతున్నాయి. అతి తక్కువ ధరలతో అత్యాధునిక చికిత్సలు అందుతున్నాయి."- శ్రీధర్‌బాబు, మంత్రి

**హైదరాబాద్‌లో ప్రత్యేక ఇన్నోవేషన్ హబ్ :** హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని విధాల సహకారం అందించేందుకు కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. ఇప్పటికే అనేక ప్రముఖ లైఫ్ సైన్సెస్ సంస్థలు హైదరాబాద్ నగరం గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీఎస్) స్థాపించాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, భవిష్యత్తు దృష్ట్యా భారత్ ఫ్యూచర్ సిటీలో జీసీసీల కోసం ప్రత్యేక జోన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. ముఖ్యంగా అంతర్జాతీయ లైఫ్ సైన్సెస్ సంస్థల ఇన్నోవేషన్ సెంటర్ల స్థాపనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్ హైటెక్స్ వేదికగా జరుగుతున్న బయోఏసియా -2026 సదస్సు సందర్భంగా పలు అంతర్జాతీయ జీవ విజ్ఞాన సంస్థల




ఉన్నతాధికారులు, ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఐటీ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి పెట్టుబడులపై చర్చించారు.ఈ భేటీలో పలు సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఒపెల్లా హెల్త్‌కేర్ అనే గ్లోబల్ కన్స్యూమర్ హెల్త్‌కేర్ సంస్థ 42,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీసీసీ కార్యకలాపాలను విస్తరించుతూ వచ్చే ఏడాదిలో 500 ఉద్యోగాలను సృష్టించనుంది. అనే సంస్థ, జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక బీఎస్ఎల్-3 టీకా తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రం కోళ్లు, పశువులు, పందులు జలచరాల కోసం టీకాలు తయారు చేస్తోంది. ట్రైడెన్స్ ఇంక్ సంస్థ, హైదరాబాద్‌లో ప్రత్యేక ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రం ఏఐ ఆధారిత ఆరోగ్య సంరక్షణ మరియు లైఫ్ సైన్సెస్ విశ్లేషణలపై దృష్టి సారించనుంది. ఈ కేంద్రం సుమారు 18,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండి, సంస్థ యొక్క గ్లోబల్ కార్యకలాపాలకు మద్దతు అందిస్తుంది.సంస్థ, హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో భారత లైఫ్ సైన్సెస్ రంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో కొత్త భారీ లైఫ్ సైన్సెస్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనుంది.

# హైదరాబాదులో అక్రమంగా నివసిస్తున్న 23 మంది విదేశీయుల అరెస్ట్

మొదటిపేజీ తరువాయి - హైదరాబాద్ నగరంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గోల్కొండ జోన్ పరిధిలోని టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి, వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉంటున్న 23 మంది విదేశీయులను అదుపులోకి తీసుకున్నారు.గోల్కొండ జోన్ డీసీపీ జి. చంద్రమోహన్ ప్రత్యక్ష పర్యవేక్షణలో సుమారు 250 మంది పోలీసు సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. పారామౌంట్ కాలనీ (గేట్లు 1 నుంచి 4), ఐఏఎస్ కాలనీ, హకీంపేట్ కుంట ప్రాంతాల్లో పక్కా సమాచారంతో పోలీసులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) అధికారుల సహాయంతో ఈ సోదాలు జరిగాయి. వివిధ దేశాలకు చెందిన 23 మంది అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించారు. వీరి వీసా, పాస్‌పోర్ట్ గడువు ముగిసినట్లు తేలింది.ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న 9 గ్యాస్ సిలిండర్లు, చట్టవిరుద్ధంగా నిల్వ ఉంచిన 53 మద్యం బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు.ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, నివాస చట్టాలను కఠినంగా అమలు చేస్తామని డీసీపీ చంద్రమోహన్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. కాగా, అదుపులోకి తీసుకున్న విదేశీయులు ఏ దేశస్థులనే వివరాలను పోలీసులు వెల్లడించలేదు. టోలిచౌకి, పారామౌంట్ కాలనీ ప్రాంతాల్లో ఆఫ్రికన్ దేశాలకు చెందిన వారు ఎక్కువగా నివసిస్తుంటారు. గతంలోనూ డ్రగ్స్ సంబంధిత కేసుల్లో ప్రమేయం ఉన్న పలువురు విదేశీయులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి దేశాలకు



తిప్పి పంపిన విషయం తెలిసిందే.

# మండలిలో అచ్చెన్నాయుడు ఫైర్

మొదటిపేజీ తరువాయి - తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో వైసీపీ నేతలపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. లడ్డూలో కల్తీ జరిగిందని నాటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డే స్వయంగా ఒప్పుకున్నాక కూడా, వైసీపీ నేతలు సిగ్గులేకుండా ఎదురుదాడి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు."తప్పు ఒప్పుకున్నాక కూడా బుకాయిస్తారా? వైసీపీ నేతల్లారా సిగ్గుపడండి" అని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసి, పవిత్ర ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైసీపీకి ధర్మం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఈ సందర్భంగా గతంలో జగన్ తిరుమల పర్యటనను మంత్రి గుర్తుచేశారు. హిందూ సంప్రదాయాల ప్రకారం డిక్లరేషన్ ఇవ్వడానికి జగన్ ఎందుకు భయపడ్డారని ప్రశ్నించారు.అంతేకాకుండా, హెరిటేజ్ సంస్థపై అడ్డగోలు ఆరోపణలు చేయడం మానుకోవాలని, దమ్ముంటే కనీసం ఒక్క ఆధారమైనా చూపాలని వైసీపీకి సవాల్ విసిరారు. వ్యవస్థలను భ్రష్టు పట్టించి, హిందూ ధర్మంపై దాడులకు పాల్పడిన ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అచ్చెన్నాయుడు హెచ్చరించారు. సత్యం గెలిచి తీరుతుందని, తప్పు చేసిన వారు తప్పకుండా శిక్ష అనుభవిస్తారని ఆయన స్పష్టం చేశారు.

## విశాఖపట్నం చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

మొదటిపేజీ తరువాయి - భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేటి సాయంత్రం విశాఖపట్నం చేరుకున్నారు. నగరంలోని ఐఎన్ఎస్ డేగా నౌకాదళ విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆమెకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సాదరంగా స్వాగతం పలికారు. ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాస్, ఉన్నతాధికారులు కూడా రాష్ట్రపతిని ఆహ్వానించిన వారిలో ఉన్నారు.మంగళవారం (ఫిబ్రవరి 18) విశాఖ తీరంలో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష-2026'కు రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. భారత సాయుధ దళాల సుప్రీం కమాండర్‌గా ఆమె ఈ సమీక్షను పర్యవేక్షిస్తారు. ఈ కార్యక్రమంలో భారత నౌకాదళంతో పాటు పలు విదేశీ యుద్ధనౌకలు కూడా పాల్గొంటాయి.ఈ పర్యటనలో భాగంగా, ఫిబ్రవరి 19న జరిగే 'మిలన్ అంతర్జాతీయ సిటీ పరేడ్', 20న నిర్వహించే 'కాన్‌క్లేవ్ ఆఫ్ చీఫ్స్' కార్యక్రమాల్లో కూడా రాష్ట్రపతి పాల్గొంటారు. ఆమె పర్యటన నేపథ్యంలో విశాఖ నగరంలో పోలీసులు, నౌకాదళ అధికారులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ అంతర్జాతీయ ఈవెంట్, భారత నౌకాదళ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడంతో పాటు, మిత్రదేశాలతో సంబంధాలను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

## ఎవరెస్టుపైకి వెళ్లగలిగే హెలికాప్టర్ తయారు చేస్తాం

మొదటిపేజీ తరువాయి - భారత్- ఫ్రాన్స్ సంబంధాలు ప్రత్యేకమైనవని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత్-ఫ్రాన్స్ దేశాల మధ్యే కాకుండా, ప్రజల మధ్య కూడా సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. పరిశ్రమలే కాదు ఆవిష్కరణల్లోనూ ఫ్రాన్స్, భారత్ సహకరించుకుంటాయన్నారు. ఫ్రాన్స్ దశాబ్దాల తరబడి వ్యూహాత్మక భాగస్వామిగా ఉందని గుర్తు చేశారు. ఫ్రాన్స్ సహాయంతో ఎవరెస్టుపైకి వెళ్లగలిగే హెలికాప్టర్ తయారు చేస్తామని, భారత్‌లో తయారయ్యే హెలికాప్టర్లు ప్రపంచమంతా ఎగుమతి అవుతాయన్నారు. క్లీన్ ఎనర్జీ, స్పేస్ వంటి రంగాల్లో భారత్, ఫ్రాన్స్ కలసి పనిచేస్తాయని వెల్లడించారు. ముంబయిలో జరిగిన భారత్- ఫ్రాన్స్ ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా ఇరువురు దేశాధినేతలు సమావేశమయ్యారు.

## త్వరలో ప్రతి జోన్‌లో పర్యటిస్తా

మొదటిపేజీ తరువాయి - తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10 శాతం ప్రకటన బోర్డులు కేటాయించాలని తెలిపారు. అడ్వర్టైజింగ్ బోర్డుల నుంచి ఏడాదికోసారి ఫీజు వసూలు చేయాలని అన్నారు.పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి : నగరంలో వీధిదీపాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మూడు కార్పొరేషన్లలో పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలని అధికారులకు సూచించారు. త్వరలో ప్రతి జోన్‌లో పర్యటిస్తానని వెల్లడించారు. రోడ్లు శుభ్రంగా లేకుంటే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్లు, జోనల్ కమిషనర్లు పొద్దున్నే ఫీల్డ్‌లో ఉండాలని సీఎం ఆదేశించారు. సీఎస్, సీఎంవో సెక్రటరీ, హెచ్ఎండీఏ కమిషనర్‌తో కలిసి సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష జరిపారు.

## ప్రణాళిక బద్ధంగా పాఠశాల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి...

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పాఠశాల అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**




**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 17( వార్త సంధ్య) :** ప్రణాళిక బద్ధంగా పాఠశాల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పాఠశాలలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కొరకు చేపట్టిన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వర్షా కాలం లోపు గ్రౌండ్ లెవెలింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్ ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. 40 లక్షలతో డ్యూయల్ డెస్క్ కొనుగోలు చేశామని, వీటిని విద్యార్థుల సంఖ్య ఆధారంగా సంబంధిత కెజిబీవీ, ఆదర్శ పాఠశాలలకు కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు. కేజీబీవీ లో కిచెన్ ఆధునికరణ కోసం 20 లక్షల మంజూరు చేశామని అన్నారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి ఆధారంగా బిల్లులు విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. సింగరేణి ప్రభుత్వ గ్రామాలలోని పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో సిపిఓ రవీందర్, డిసిహెచ్ఓ శ్రీధర్, సమగ్ర శిక్ష జిల్లా సమన్వయకర్త పిఎం షేక్, ప్లానింగ్ సెక్టోరియల్ ఆఫీసర్ మల్లేష్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆసుపత్రిలో అందే వివిధ వైద్య చికిత్సలను ప్రజలు వినియోగించుకోవాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**జిల్లా ఆసుపత్రి ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి17 (వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో అందే వివిధ వైద్య చికిత్సలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం పెద్దపల్లి పట్టణంలో ఉన్న జిల్లా ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష 24 లక్షల రూపాయలతో కంటి శస్త్ర చికిత్స విభాగంలో నూతనంగా కొనుగోలు చేసిన ఫాకో యంత్రం పని తీరు వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. కంటి శస్త్ర చికిత్స లను అత్యాధునిక పద్ధతుల్లో విజయవంతంగా చేసేందుకు వినియోగించే ఈ ఫాకో యంత్రం పెద్దపెల్లి జిల్లాలోనే ప్రథమంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేయడం జరిగిందని అవసరమైన ప్రజలు దీనిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట అదనపు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, కంటి శస్త్ర చికిత్స నిపుణులు డా సబిహా సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా హాస్పిటల్ లో లభించుచున్న యూరాలజీ సేవలు, లాప్రోస్కోపిక్ సర్జరీ సేవలు ,హిస్టెరెక్టమీ, డెలివరీలు, స్కానింగ్ మరియు టిఫా స్కానింగ్ , రూట్ కెనాల్ చికిత్స సేవలు,నవ జాత శిశు కేంద్రం సేవలు, ఆర్థో సర్జరీ సేవలు , ఆర్థోస్కోపిక్ సర్జరీ సేవలు, 2డి ఎకో సేవలు, డయాలసిస్ సేవలు, కంటి సంబంధిత ఫాకో సర్జరీ సేవలు, టి హబ్ సేవలు పూర్తి స్థాయిలో ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

## 1 లక్ష 50 వేల ఎల్ఓసి మంజూరు చేయించిన

**మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**



**పెద్దపల్లి, మంథని ఫిబ్రవరి 17 (వార్త సంధ్య ) :**తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గంలోని ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన మారుపాక భారతమ్మ కి 1 లక్ష 50 వేల ఎల్ఓసి మంజూరు చేసి ఇప్పించారు. మారుపాక భారతమ్మ వైద్య చికిత్సకు సంబంధించిన నిమ్స్ ఆసుపత్రి లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి తెలుపగా వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తశీ వీరికి 1 లక్ష 50 వేలు ,మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. అండగా నిలిచిన మంత్రి శ్రీధర్ బాబు కి వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

దుద్దిళ్ళ హస్తం - పేదల నేస్తం

## మంథని నియోజకవర్గం లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు




**పెద్దపల్లి, మంథని ఫిబ్రవరి 17 (వార్త సంధ్య) :**మంథని నియోజకవర్గం లోని కమాన్ పూర్, రామగిరి, ముత్తారం, మంథని, మల్హర్,కాటారం, మహదేవ్ పూర్,మహాముత్తారం, పలిమెల మండల కేంద్రాల్లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు తెలంగాణ స్వరాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు భీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

## ఆదర్ సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి

**: పోస్టల్ సూపర్డెంట్ ముత్యాల శ్రీనివాస్**



**పెంటపాడు, ఫిబ్రవరి 17 (వార్త సంధ్య):** ఆధార్ సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తాడేపల్లిగూడెం పోస్టల్ సూపర్డెంట్ ముత్యాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పెంటపాడు పోస్ట్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ ను తాడేపల్లిగూడెం పోస్టల్ సూపర్డెంట్ ముత్యాల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సెంటర్లో ఆధార్, బయోమెట్రిక్, అప్లికేషన్స్, మొబైల్ ఫోన్ నెంబర్ తో లింకు పేరు డేటా ఆఫ్ బర్త్, అడ్రస్ మార్పు చేర్పులు, చిన్నపిల్లల ఆధార్ కార్డు నమోదు, కొత్త ఆధార్లు పిల్లలు తప్పనిసరిగా చేయవలసిన వేలిముద్రలు అప్లికేషన్స్ మొదలగు ఆదర్ సేవలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. పెంటపాడు పోస్ట్ ఆఫీస్ పరిధిలో ఆరు బ్రాంచ్ లు ఉన్నాయని ఆ గ్రామ ప్రజలు వినియోగించుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సబ్ పోస్ట్ మాస్టర్ టి లక్ష్మినారాయణ, పోస్టల్ ఏపీ ఆధార్ ఆపరేటర్ పి సాయి తదితరులు ఉన్నారు.

# "ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్"గా హైదరాబాద్

**లైఫ్ సైన్సెస్ రంగంలో 2030 నాటికి కొత్తగా 5 లక్షల మందికి ఉద్యోగాలు**

**ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా తెలంగాణను నిలిపేలా కృషి**

**బయో ఏషియా 2026" ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**




**పెద్దపల్లి, మంథని ఫిబ్రవరి 17( వార్త సంధ్య ) :** ఫార్మా రాజధానిగా పేరొందిన హైదరాబాద్ ను "ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్" గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి... కొత్తగా 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ దశాబ్దం చివరి నాటికి ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో రాష్ట్రాన్ని ఒకటిగా నిలిపేందుకే "తెలంగాణ నెక్ట్స్- జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ(2026- 2030)" రూపొందించామని మంగళవారం హెచ్ఐసీసీ లో నిర్వహించిన "బయో ఏషియా 2026" సదస్సు ఆయన వివరించారు. ఇప్పటి వరకు లైఫ్ సైన్సెస్ రంగంలో సప్లై కోసం మాత్రమే మన వైపు చూసిన ప్రపంచం ఇప్పుడు ప్రస్తుతం ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాల కోసం చూస్తోందన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేలా తెలంగాణను అన్ని రకాలుగా సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా (ఎంఆర్ఎన్ఏ), జీన్ ఎడిటింగ్, ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ వంటి అత్యాధునిక రంగాల్లో "రెడీ టూ వర్క్ ఫోర్స్"గా ఇక్కడి యువతను తయారు చేస్తున్నామన్నారు. సీబీఆర్ఈ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్ (2025) ప్రకారం, బోస్టన్, శాన్ ఫ్రాన్సిస్కో, బీజింగ్, టోక్యో లాంటి గ్లోబల్ హబ్‌ల సరసన నిలిచిన ఏకైక భారతీయ నగరం హైదరాబాద్ అని అన్నారు. అందుకే... కేవలం ఉత్పత్తి చేయడమే కాకుండా, నేటి అవసరాలకు అనుగుణంగా కొత్త ఔషధాలను కనుగొనే కేంద్రంగానూ హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. అలాగే... గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్ గానూ మార్చేందుకు ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామన్నారు. ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ, ఆటోమేషన్ ఇన్ బయోలాజిక్స్ మాన్యుఫాక్చరింగ్, డేటా ఆధారిత ప్రెసిషన్ మెడిసిన్ ,కంప్యూషనల్ బయాలజీ, బయో మాన్యుఫాక్చరింగ్ 4.0 తదితర రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని దిగ్గజ పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు.




# ఇంటర్మీడియెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**ఉదయం 6.00 గంటల నుంచి 8.00 గంటల వరకు విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు**

**భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**



**భద్రాద్రి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 17(వార్త సంధ్య) :** జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 18వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు సంబంధిత విభాగాధిపతులను నియమించినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా అనుభవం కలిగిన ఇన్విజిలేటర్లను నియమించాలని ఆదేశించారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల భద్రత విషయంలో పూర్తి అప్రమత్తత పాటించాలని సూచించారు. ప్రశ్నాపత్రాల నిల్వ, పంపిణీ, రవాణా ప్రక్రియలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, సంబంధిత పోలీస్ స్టేషన్లలో స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేసి భద్రత మధ్య రవాణా నిర్వహించాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి అమలు చేసి, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల ప్రాంతంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశించారు. పరీక్షలు ముగిసిన అనంతరం జవాబు పత్రాలను అత్యంత జాగ్రత్తగా, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా సంబంధిత మూల్యాంకన కేంద్రాలకు పంపించేందుకు పోస్టల్ శాఖ అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జవాబు పత్రాల సీలింగ్, భద్రతా తనిఖీలు, రవాణా ప్రక్రియలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని, నిర్ణీత కాలవ్యవధిలో గమ్యస్థానాలకు చేరేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్ష నిర్వహించు రోజుల్లో ఉదయం 6.00 గంటల నుంచి 8.00 గంటల వరకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచనలు ఇచ్చారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య శాఖ అధికారులు ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సదుపాయాలు కల్పించి, ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్, పంచాయతీ శాఖ అధికారులు పరీక్షా కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష రాయనున్న విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం ఒక గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఇంటర్మీడియెట్ పరీక్షలను ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈవో నాగలక్ష్మి, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వరరావు, టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సులోచన రాణి, వైద్యశాఖ, పోలీస్ శాఖ, మున్సిపల్, పంచాయతీ, విద్యుత్, పోస్టల్ శాఖ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు



**కొత్తగూడెం, ఫిబ్రవరి 17(వార్త సంధ్య) :** హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మంగళవారం తీర్పు వెలువరించారు.కేసు వివరాలు దమ్మపేట మండలం మల్కారం గ్రామానికి చెందిన గుడిమెట్ల పోచమ్మ ఫిర్యాదు మేరకు 07 జూలై 2022 సాయంత్రం ఆమె బావ గుడిమెట్ల నాగేంద్రరావు తన కుటుంబంతో అన్నపురెడ్డిపల్లికి వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఆమె అత్త సుబ్బలక్ష్మి (50) మరియు తన కుమారుడు ఆకాష్ (7) రాత్రి నాగేంద్రరావు ఇంటిలో నిద్రపోయారు. తరువాత రోజు ఉదయం ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా సుబ్బలక్ష్మి మరియు ఆకాష్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు గుర్తించారు సుబ్బలక్ష్మి నోటి, ముక్కు నుండి రక్తస్రావం గడ్డం క్రింద గాయాలు బాలుడికి ముఖంపై గాయాల గుర్తులు కనిపించాయి దీంతో దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. అప్పటి ఎస్‌హెచ్ఓ ఎస్ఐ కె. శ్రావణ్ కుమార్ కేసు నమోదు చేయగా, అశ్వారావుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. బాలకృష్ణ దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో ఈస్ట్ గోదావరి జిల్లా ఉంద్రాజవరం మండలం వలివేణు గ్రామానికి చెందిన మల్లవరపు శ్రీనివాసరావు ఈ రెండు హత్యలు చేసినట్టు నిర్ధారించి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టులో 14 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు అయ్యి నిందితుడు మల్లవరపు శ్రీనివాసరావుకు జీవిత ఖైదు రూ.1,000 జరిమానా, జరిమానా చెల్లించకపోతే అదనంగా 6 నెలల సాధారణ జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వి.డి. లక్ష్మి వాదనలు వినిపించారు. కోర్టు నోడల్ ఆఫీసర్ డి. రాఘవయ్య, లైజాన్ ఆఫీసర్ ఎన్. వీరబాబు, కోర్టు డ్యూటీ పీసీ సి.హెచ్. శ్రీను సహకరించారు.

## అరుణాచలంలో కేసీఆర్ ఘనంగా జన్మదిన వేడుకలు



**కొత్తగూడెం కార్పొరేషన్, ఫిబ్రవరి 17 (వార్త సంధ్య):** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కె. కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టినరోజు సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలేశ్వర స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, రాబోయే రోజుల్లో మళ్లీ ముఖ్యమంత్రి కావాలని భగవంతుని ప్రార్థిస్తూ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావు, చుంచుపల్లి మండల అధ్యక్షుడు ముత్యాల రాజేష్, జిల్లా పార్టీ నాయకుడు సంకుబాపన అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో న్యాయవాదుల ధర్నాకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే జారె



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 (వార్త సంధ్య):** దమ్మపేటలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ వాదులు నిర్వహించిన ధర్నా-ర్యాలీలో ఎమ్మెల్యే జారె ఆది నారాయణ పాల్గొని సంఘీభావం తెలిపారు. హైదరాబాద్ లో న్యాయవాది ఖాధీర్ హత్యను ఖండిస్తూ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేకంగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యాయవాదులు సమాజంలో న్యాయం కోసం పోరాడే శక్తులని, వారి భద్రత రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఖాధీర్ హత్య ఘటన బాధాకరమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదుల రక్షణకు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



## రెవెన్యూ శాఖలో టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సేవలు కొనసాగించాలి: రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతి



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 (వార్త సంధ్య) :** రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను కొనసాగించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)కి వినతి పత్రం సమర్పించారు. గత వారం సీసీఎల్ఏ కార్యాలయం నుండి జారీ చేసిన మెమో ప్రకారం, రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను నిలిపివేయాలని ఆదేశాలు ఇవ్వడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం వల్ల తెలంగాణ వ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 632 మంది టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లు, అలాగే రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న 42 మంది సిబ్బంది మరియు వారి కుటుంబాలు తీవ్ర అనిశ్చితిలో పడినట్లు వారు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వాల కాలం నుంచి నిరంతరాయంగా రెవెన్యూ శాఖలో సేవలు అందిస్తూ శాఖ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తున్నామని తెలిపారు. తమలో చాలామంది వయోపరిమితి దాటిపోవడంతో ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ 632 మంది సిబ్బంది మరియు వారి కుటుంబాల జీవనోపాధి పూర్తిగా ఈ ఉద్యోగంపైనే ఆధారపడి ఉన్న నేపథ్యంలో, సేవలను నిలిపివేయడం వల్ల తీవ్ర ఆర్థిక, సామాజిక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. అందుకే మానవతా దృక్పథంతో తమ సేవలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లు రమేష్, రాజు, అనిల్, శ్రీనివాస్, పరమేశ్వర్, సుజాత, కామాక్షి, వనజతో పాటు వివిధ కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల్లో పనిచేస్తున్న మండల ఆపరేటర్లు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పునఃసమీక్షించాలి

### : రంగారెడ్డి జిల్లా టీజీవో అధ్యక్షుడు డా. కె. రామరావు




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 ( వార్త సంధ్య) :** ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈ హెచ్ ఎస్)ను సమగ్రంగా పునఃసమీక్షించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె. రామరావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి వినతి పత్రం సమర్పించారు. మంగళవారం నాడు రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె. రామరావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి, ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈ హెచ్ ఎస్)పై రంగారెడ్డి జిల్లా అధికారులు మరియు ఇతర ఉద్యోగుల నుంచి అందిన సూచనలు, ప్రతిపాదనలను సమగ్రంగా సమీక్షించి, వాటి ఆధారంగా టీజీవో సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస రావు మరియు ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలు, చికిత్స పరిమితులు, ఆసుపత్రుల ఎంప్యానెల్ అంశాలు, క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం వంటి అంశాలను ఈ వినతి పత్రంలో వివరించినట్లు వారు తెలిపారు. ఈ అంశాలపై ప్రభుత్వంతో రాబోయే చర్చల్లో తమ వినతులను పరిగణలోకి తీసుకొని, ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలని టీజీవో సెంట్రల్ అసోసియేషన్ నాయకత్వాన్ని వారు కోరారు. ఉద్యోగులు మరియు పెన్షనర్ల ఆరోగ్య భద్రత దృష్ట్యా, ఈ పథకాన్ని మరింత ప్రయోజనకరంగా, పారదర్శకంగా రూపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేశారు.

## అరుణాచలంలో కేసీఆర్ ఘనంగా జన్మదిన వేడుకలు



**కొత్తగూడెం కార్పొరేషన్, ఫిబ్రవరి 17 (వార్త సంధ్య):** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కె. కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టినరోజు సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలేశ్వర స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసీఆర్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని, రాబోయే రోజుల్లో మళ్లీ ముఖ్యమంత్రి కావాలని భగవంతుని ప్రార్థిస్తూ అభి, షేకాలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్య క్రమం లో బీఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావు, చుంచుపల్లి మండల అధ్యక్షుడు ముత్యాల రాజేష్, జిల్లా పార్టీ నాయకుడు సంకుబాపన అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో న్యాయవాదుల ధర్నాకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే జారె



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 (వార్త సంధ్య):** దమ్మపేటలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిర్వహించిన ధర్నా-ర్యాలీలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొని సంఘీభావం తెలిపారు. హైదరాబాద్ లో న్యాయవాది ఖాధీర్ హత్యను ఖండిస్తూ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేకంగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యాయవాదులు సమాజంలో న్యాయం కోసం పోరాడే శక్తులని, వారి భద్రత రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఖాధీర్ హత్య ఘటన బాధాకరమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదుల రక్షణకు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

## పుస్తక ప్రియుల పాదయాత్ర విజయవంతం

"పుస్తకాలు మనిషిని మారుస్తాయి, మనిషి సమాజాన్ని మారుస్తాడు"





**టేకులపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 17 (వార్త సంధ్య):** టేకులపల్లి శాఖా గ్రంథాలయం టేకులపల్లి నందు పుస్తక పఠనం పై ఆసక్తి పెంపొందించుటకై పుస్తక ప్రియుల పాదయాత్ర నిర్వహించడం జరిగింది.ముఖ్య అతిథులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు జెండా ఊపి ర్యాలీ నిర్వహించడం జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ మండలంలోని ఉన్న విద్యార్థులు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని... మండలం అధికారులు మేధావులు..పాత్రికేయులు ప్రతి ఒక్కరు గ్రంథాలయానికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుస్తక ప్రియులు చాగంటి కృష్ణమూర్తి మాట్లాడుతూ నాకు గ్రంథాలయమునకు 50 సంవత్సరాలు అనుబంధం ఉంది.. మండలంలోని ఉన్న ప్రజలు విద్యార్థులు ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.గ్రంధా పాలకుడు ఆర్ నాగన్న, గ్రాడ్యుయేట్ స్కూల్ బ్రహ్మాచారి .. మెయిన్ రోడ్ హై స్కూల్ మోహన్ .. ప్రభుత్వ జూనియర్ కాలేజీ బసవమ్మ గ్రంథ పాలకుడు బాబురావు లెక్చరర్ శంకర్ సార్ మాంటిసోరి యజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలోనే పోస్టింగ్ ఇచ్చి మా కుటుంబాలను ఆదుకోండి

### - గుర్తింపు సంఘాన్ని కోరిన బదిలీ వర్కర్ లు

### ఏఐటీయూసీకి బదిలీ వర్కర్ల వినతి




**కొత్తగూడెం/సింగరేణి, ఫిబ్రవరి 17 (వార్త సంధ్య):** కారుణ్య నియామకాల ద్వారా ఎంపికై, శిక్షణ పూర్తి చేసుకున్న బదిలీ వర్కర్లకు స్థానిక కొత్తగూడెం ఏరియాలోనే పోస్టింగ్ ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని కార్మిక సంఘం నేతలను బాధితులు కోరారు. మంగళవారం కొత్తగూడెంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కుటుంబాలకు దూరమై ఇబ్బందులు మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లల కోటాలో ఉద్యోగాలు పొందిన తాము, ప్రస్తుతం గోదావరిఖని, భూపాలపల్లి, బెల్లంపల్లి వంటి సుదూర ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో ఉన్న వృద్ధాప్య తల్లిదండ్రులను చూసుకోవడం తమకు సాధ్యపడటం లేదని, అటు కుటుంబానికి దూరమై, ఇటు విధులకు హాజరు కావడానికి కుటుంబ సహకారం లేక నానా అవస్థలు పడుతున్నామని వివరించారు. మానవతా దృక్పథంతో యాజమాన్యంతో చర్చించి తమకు కొత్తగూడెం ఏరియాలోనే పోస్టింగ్ వచ్చేలా చూడాలని కోరారు.

సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం రాజ్ కుమార్ ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ.. సింగరేణికి సుదీర్ఘకాలం సేవలు అందించిన కార్మికుల పిల్లల సమస్య న్యాయమైనదని పేర్కొన్నారు. మెడికల్ అన్ ఫిట్ అయిన కార్మికుల ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా, వారి పిల్లలకు స్థానిక ఏరియాల్లోనే పోస్టింగ్ ఇచ్చేలా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, నాయకులు హుమాయూన్, మండల రాజు, బండారి మల్లయ్య మరియు పెద్ద సంఖ్యలో బదిలీ వర్కర్లు పాల్గొన్నారు.

## స్వదేశీ డిజైన్, మానవ కేంద్రిత సాంకేతికతపై దృష్టి సారించాలి : హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి

**హైదరాబాద్/రంగారెడ్డి బ్యూరో ఫిబ్రవరి 17 ( వార్త సంధ్య) :** స్వదేశీ డిజైన్‌తో పాటు మానవ కేంద్రిత సాంకేతికతపై యువత దృష్టి సారించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అన్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేటలోని చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)లో నిర్వహించిన జాతీయ స్థాయి విద్యార్థుల సాంకేతిక ఉత్సవం సుధీ2026ను ఆమె సోమవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆవిష్కరణలు మరియు డిజైన్‌లు సమాజ అవసరాలను తీర్చే విధంగా ఉండాలని సూచించారు. సాంకేతిక పరిష్కారాలు కేవలం సిద్ధాంత స్థాయిలో కాకుండా, అమలు సాధ్యమైనవి, వ్యయపరంగా అందుబాటులో ఉండేలా, అలాగే స్థిరత్వంతో కూడినవిగా రూపుదిద్దుకోవాలని అన్నారు. ఒక ప్రాంతానికి అనువైన సాంకేతికత మరో ప్రాంతంలో భౌగోళిక, సామాజిక మరియు వనరుల పరిమితుల కారణంగా సరిపోకపోవచ్చని పేర్కొంటూ, స్థానిక పరిస్థితులను






దృష్టిలో ఉంచుకొని ఆవిష్కరణలు చేయాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. భారతీయ పరిస్థితులు, అవసరాలు, విలువలకు అనుగుణంగా రూపొందించే "స్వడిజైన్ (స్వదేశీ డిజైన్)" ప్రాధాన్యతను ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. "డిజైన్ ఫర్ ఇండియా" భావనతో యువత ముందుకు రావాలని, స్వావలంబనతో పాటు సుస్థిర అభివృద్ధికి తోడ్పడే సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాలని సూచించారు. తాను అమలు చేసిన పునర్వినియోగ ప్లాస్టిక్ టైల్స్ తయారీ, డ్రోన్ ఆధారిత ప్రజాసేవల కార్యక్రమాలను ఉదాహరణగా పేర్కొంటూ, ఏ ఆవిష్కరణ అయినా విజయవంతం కావాలంటే భూస్థాయి పరీక్షలు, ప్రజల ఆమోదం, నిరంతర కృషి అవసరమని అన్నారు. కృత్రిమ మేధస్సు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై మాట్లాడుతూ, సాంకేతికత మనుషులను భర్తీ చేయదని, అయితే నిరంతర అభ్యాసం, నైపుణ్యాల మెరుగుదల అత్యంత అవసరమని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు జీవితాంతం నేర్చుకునే ధోరణిని అలవర్చుకోవాలని సూచించారు. సాంకేతిక అభివృద్ధిలో నైతిక విలువలు, సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తోందని పేర్కొంటూ, విద్యార్థులు తమ ఆలోచనలను వ్యాపార రూపంలో అభివృద్ధి చేసేందుకు ముందుకు రావాలని ప్రోత్సహించారు. అనంతరం "సుధీ2026 సావనీర్ 2026×"ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవాన్ని ప్రొఫెషనల్‌గా నిర్వహించిన సీబీఐటీ యాజమాన్యం, అధ్యాపకులను అభినందించారు. సంస్థలోని విద్యా మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, విద్యార్థుల ప్రతిభను పరిశీలించి, సాంకేతిక విద్యలో ఉన్నత ప్రమాణాలను కొనసాగిస్తున్నందుకు ప్రశంసించారు. సీబీఐటీ వంటి విద్యాసంస్థలు దేశ అభివృద్ధికి అవసరమైన ప్రతిభావంతులైన ఇంజనీర్లను తయారు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎ. కృష్ణయ్య, సీబీఐటీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు, ఇన్నోమైండ్స్ డిజిటల్ అండ్ ఐపీ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రవి కుమార్ మేడూరి, అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం పంచాయతీ పాలన కోనసాగాలి...

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### 3వ వైర్ ప్రతిపాదనలను గ్రామాలు అందించాలి

### పంచాయతీ శాఖ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 17 (వార్త సంధ్య) :** నిబంధనల ప్రకారం పంచాయతీ పాలన కోనసాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో. పంచాయతీ శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ , పంచాయతీ లలో 3వ విద్యుత్ వైర్ లేకుండా ఇబ్బంది పడుతున్న ప్రాంతాల జాబితాను అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామానికి తప్పనిసరిగా 3వ విద్యుత్ వైర్ ను విద్యుత్ శాఖ ద్వారా ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రోడ్లపై చెత్త ప్లాస్టిక్ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పంచాయతీ అనుమతి లేకుండా ఎటువంటి నిర్మాణాలు జరగడానికి వీలు లేదని, నిర్మాణ దశలోనే అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తూ వాటిని ఆపివేయాలని ,అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించ వద్దని కలెక్టర్ తెలిపారు. పంచాయతీ పాలనలో సర్పంచ్ లను భాగస్వామ్యం చేయాలని, మండల పంచాయతీ అధికారులు రెగ్యులర్గా పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్ లను పూర్తి స్థాయిలో తప్పనిసరిగా వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నగరాభివృద్ధిలో ముస్లింల పాత్ర మరువలేనిది

### ముస్లిం పేద మహిళలను ఆదుకునేందుకు సహకారం అందిస్తాను

### రంజాన్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి

### 400 మంది పేదలకు రూ.2,500 విలువ గల రేషన్ కిట్స్ పంపిణీ




**కృష్ణాజిల్లా బ్యూరో ఫిబ్రవరి 17 వార్త సంధ్య :** విజయవాడ ,రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా మర్కజ్ ఇమామ్ ఇబ్నే బాజ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సోసైటీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ మొహమ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం పంజా సెంటర్ వద్ద గల షా జహర్ ముసాఫిర్ ఖానాలో పేద ముస్లిం మహిళలకు రేషన్ కిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్ హాజరై ముస్లిం మహిళలకు రేషన్ కిట్స్ పంపిణీ చేశారు.తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ ఫతావుల్లా పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో 400 మంది ముస్లిం పేదలకు రూ.2,500 విలువ గల రేషన్ కిట్స్ పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సోసైటీ చేస్తున్న సేవలను కొనియాడారు. మర్కజ్ ఇమామ్ ఇబ్నే బాజ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సోసైటీకి తన పూర్తి సహకారం వుంటుందని , ఇటువంటి సోసైటీలు దేశ అభివృద్ధికి దోహదపడతాయన్నారు. రంజాన్ మాసం బుధవారం నుంచి ప్రారంభం కానున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరలంతా రంజాన్ మాసంలో దేశ అభివృద్ధి కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రార్థనలు చేయాలని ఆకాంక్షించారు. ఆటోమొబైల్ రంగంలో ముస్లిం సోదరుల పాత్ర ఎంతో వుందని, నగరాభివృద్ధిలో వారి పాత్ర మరువలేనిదన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం మైనార్టీలకు అండగా వుంటుందని స్పష్టం చేశారు. అలాగే ముస్లిం పేద మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించే విధంగా తోడ్పాడు అందించాలని మర్కజ్ ఇమామ్ ఇబ్నే బాజ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సోసైటీ నిర్వాహకులకు ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. గత ఏడాది కాలం నుంచి మహిళలకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేశినేని ఫౌండేషన్ ద్వారా ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి సహాయ సహకారాలు అందిస్తానని సోసైటీ నిర్వాహకులకు తెలిపారు. ముస్లిం సమాజ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో మర్కజ్ మజీద్ ఇమామ్ మౌలానా అబూ హోరేరా మదని, తెలుగు ప్రసంగికులు మౌలానా రబ్బాని, హనీఫ్ లతో పాటు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## పదవి ఉన్నా లేకున్నా హయత్ నగర్ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్న కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 17:** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శాంతివనం మరియు ఉషోదయ కాలనీవాసులు స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, రహదారులు, డ్రైనేజ్ వ్యవస్థలు, వీధి దీపాలు, పారిశుధ్య సమస్యల పరిష్కారం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, పార్టీ భేదాలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందించడం అభినందనీయమని తెలిపారు. స్థానిక ప్రజల ప్రేమాభిమానాలు తనపై ఎప్పటికీ బాధ్యతను మరింత పెంచుతాయని, భవిష్యత్తులో కూడా హయత్ నగర్ డివిజన్ అభివృద్ధికి తమ వంతు కృషి కొనసాగుతుందని కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ కాలనీ అధ్యక్షులు నరసింహారెడ్డి,శాంతివనం కాలనీ అధ్యక్షులు వెంకటేశం, ఇరు కాలనీలా సంక్షేమ సంఘం సభ్యులు రవీందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, బుచ్చి రెడ్డి, అరవింద్ రెడ్డి, బీజేపీ నాయకులు సంఘీ అశోక్,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఇకపై 'ఆంధ్రా యాత్రి'తో సేఫ్ రైడ్స్

**ఇది ప్రభుత్వ యాప్**

**ప్రజలకు తక్కువ ధరకే సేవలు అందేలా ప్రణాళిక**

**పీపీపీ విధానంలో ఏర్పాటుకు రవాణా శాఖ కసరత్తు**

**ప్రైవేటు యాప్‌లకు పోటీగా అందుబాటులోకి తెచ్చే యత్నం**

సిటీలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాలంటే చాలా వరకు ఎక్కువ మంది మొబైల్ యాప్‌లో ఆటో, టాక్సీ, బైక్ ఇలా తమకు అవసరమైంది బుక్ చేసుకుంటారు. ఒకరి కంటే ఎక్కువ మంది అయితే ఆటో, కారు, ఒక్కరే వెళ్లాల్సి వస్తే బైక్ ట్యాక్సీని బుక్ చేసుకుంటున్నారు. ఇలా అవసరానికి రైడ్స్ బుక్ చేసుకోవాలంటే మన కోసం అందుబాటులో ఉన్నవి అన్నీ ప్రైవేటు యాప్‌లే. ఈ నేపథ్యంలో 'ఆంధ్రా యాత్రి' పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఓ యాప్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు రచిస్తోంది. దీనికోసం ఆన్‌లైన్‌లో ఫ్లాట్ ఫామ్ నిర్వహణ, తదితరాల అవసరాల కోసం గుత్తేదారును ఎంపిక చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు, భాగస్వామ్యం) విధానం కింద ఈ యాప్‌ను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

**చందా రుసుము చెల్లిస్తే చాలు:** ఈ యాప్ ద్వారా బైక్, ఆటో, కారు ట్యాక్సీ డ్రైవర్లు రైడ్స్ పొందాలనుకున్న వాళ్లు దీనికోసం నామమాత్రపు చందా రుసుము చెల్లిస్తే సరిపోతుంది. ఒక్కో బైక్ ట్యాక్సీ ట్రిప్‌కి గరిష్ఠంగా రూ.3, రూ.5 తో ఆటో, రూ.11 కారు కోసం చందా రుసుము ఉంటుంది. ఆయా వాహనాన్ని బట్టి రోజు మొత్తానికి రూ.30 నుంచి రూ.50 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎన్ని రైడ్స్ అయినా పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ప్రైవేటు యాప్స్‌లో డ్రైవర్ కమీషన్‌గా ప్రతి రైడ్‌కు తాను పొందే డబ్బు మొత్తంలో 20 శాతం వరకు యాప్ వారికే చెల్లించాల్సి వస్తోంది. ఇటువంటిదేదీ 'ఆంధ్రా యాత్రి' యాప్‌లో ఉండదు. కేవలం ముందుగా రైడ్స్ పొందేందుకు చందా రుసుము మాత్రమే తీసుకుంటారు.

**టెండర్ కోట్ ఇదే:** యాప్ నిర్వహణ గుత్తేదారు ఈ విధంగా వసూలైన చందా డబ్బుల నుంచి 10 శాతం మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ యాప్ కోసం ప్రచారం బ్రాండింగ్ వంటి మిగిలిన వాటన్నింటికి అయ్యే మొత్తాన్ని రాష్ట్ర రవాణాశాఖ వినియోగిస్తుంది. ఈ యాప్‌నకు చెందిన ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ నిర్వహణకు బిడ్లు ఆహ్వానించనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. దీనికోసం వాహన యజమానుల నుంచి ఎవరైతే తక్కువ చందా రుసుం తీసుకుని, ఈ యాప్‌ను నిర్వహిస్తామంటూ కోట్ చేస్తారో వారికే టెండరు కేటాయించనున్నట్లు తెలుస్తుంది.

**అన్ని శాఖలను కలుపుతూ:** రవాణా శాఖతో పాటు ఈ యాప్‌తో, ఆర్టీసీ, పోలీస్, కార్మిక శాఖలు, టూరిజం, ఆర్టీజీఎస్‌ను కూడా అనుసంధానం చేస్తారు. అన్ని శాఖల పర్యవేక్షణ ఉండడంతో రైడ్ బుక్ చేసుకున్న వారికి సురక్షితమైన ప్రయాణం లభిస్తుంది. డ్రైవర్ల నుంచి ఎటువంటి కమీషన్ వసూలు చేయకపోవడంతో వల్ల ప్రయాణికులకు కూడా రైడ్స్ కొంత వరకు తక్కువ ధరకే లభిస్తాయి. ఇందులో రియల్‌టైమ్ ట్రాకింగ్ తదితరాలన్నీ ఉంటాయి.

**ప్రయోగాత్మకంగా ఆ13 జిల్లా కేంద్రాల్లో :** ఒకప్పటి ఉమ్మడి జిల్లా కేంద్రాలైన తిరుపతి, విజయవాడ నగరాల్లో ముందుగా ఈ 'ఆంధ్రా యాత్రి' ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. ఇక్కడ ప్రయోగాత్మకంగా చేసిన అనంతరం ఇతర పట్టణాల్లో కూడా ఈ యాప్‌ను అందుబాటులోకి తెనున్నట్లు తెలుస్తుంది. ఇందుకోసం పాలసీ రూపొందిస్తున్నారు. దాంట్లే నియమ నిబంధనలు ఖరారు చేసి, ఆపై టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో గతంలో కేంద్ర ప్రభుత్వం ఇదే విధానంలో 'భారత్ యాత్రి' అనే యాప్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించింది. ఏపీలో కూడా దీనిని భవిష్యత్తులో అమలు చేస్తారు. 'ఆంధ్రా యాత్రి' యాప్‌ని అందులో విలీనం చేస్తారు.

## జగన్ అక్రమాస్తులు, ఓఎంసీ కేసులో ఐఏఎస్ శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

**శ్రీలక్ష్మి పాల్పడిన అక్రమ వ్యవహారాలన్నీ ట్రయల్‌లోనే బయటపడుతాయన్న దర్యాప్తు సంస్థ**

**సీబీఐ వాదనను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు**

**శ్రీలక్ష్మి పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన ధర్మాసనం**

జగన్ అక్రమాస్తులతో పాటు గాలిజనార్ధన్‌రెడ్డికి చెందిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి గనుల కేటాయింపు కేసుల్లో సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ రెండు కేసుల నుంచి తనను తప్పించాలంటూ శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టేస్తూ తెలంగాణ హైకోర్ట్ గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది.ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి నిబంధనలకు అనుగుణంగానే గనులు కేటాయించినట్లు శ్రీలక్ష్మి వివరణ ఇచ్చుకోగా గనులశాఖ కార్యదర్శిగా అనేక ఉల్లంఘనలకు పాల్పడినట్లు సీబీఐ కౌంటర్ ఇచ్చింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి అక్రమంగా గనులు కేటాయించడంలో శ్రీలక్ష్మి కీలకంగా వ్యవహరించారని, క్యాప్టివ్ మైనింగ్ అనే పదాన్ని తొలగించి అక్రమాలకు ఆమే బాటలు వేశారని సీబీఐ స్పష్టం చేసింది. పదవిలో ఉన్నంతకాలం శ్రీలక్ష్మి భారీగా అక్రమాస్తులు కూడబెట్టుకున్నారని వివరించింది. ఆ సమయంలో శ్రీలక్ష్మి మరిది భారీగా అక్రమాస్తులు సంపాదించారని సీబీఐ వెల్లడించింది.డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు: గనులు కేటాయించేందుకు శ్రీలక్ష్మి లంచం కూడా డిమాండ్ చేసినట్టు సాక్షులు వాంగ్మూలం ఇచ్చారని కోర్టుకు తెలిపిన సీబీఐ ఆమె అక్రమాలన్నీ విచారణలోనే తెలుతాయన్నారు. సీబీఐ వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు శ్రీలక్ష్మి వేసిన డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టేసింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. వేరే కేసుగా భావించి ఇందులో తొలుత స్టే ఇచ్చామని, ఇప్పుడు ఆ పొరపాటును సవరిస్తున్నామని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుందరేశ్ అన్నారు. పొరపాటుగా ఇచ్చిన స్టేను నిందితులు ఎంజాయ్ చేశారని వ్యాఖ్యానించారు. విచారణ కొనసాగించాలని ట్రయల్ కోర్టును ఆదేశించారు.మరోవైపు జగన్ అక్రమాస్తుల కేసులో భాగంగా పెన్నా సిమెంట్స్‌కు లీజుల మంజూరు చేయడంలో అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి శ్రీలక్ష్మి అధికార దుర్వినియోగం పై ఆధారాలు ఉన్నాయని సీబీఐ గతంలో స్పష్టం చేసింది. శ్రీలక్ష్మి పై కేసు కొనసాగించడానికి అన్ని ఆధారాలు సేకరించామని తెలంగాణ హైకోర్టుకు నివేదించిన విషయం తెలిసిందే.శ్రీలక్ష్మి పై కేసు కొనసాగించడానికి అన్ని ఆధారాలను సేకరించామని సీబీఐ తెలిపింది. గతంలో స్పష్టం చేసిన ఈ విషయంపై మళ్లీ పిటషన్ దాఖలు వేయడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. అనంతపురం జిల్లా యాకిడిలో 231 ఎకరాల భూ కేటాయింపు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం కౌలపల్లిలో 304.70 హెక్టార్ల లీజును అంచనా వేయడంలో, రంగారెడ్డి జిల్లా తాండూరులో 822.13 ఎకరాల లీజు రెన్యువల్‌తో పాటు హైదరాబాద్‌లో పయనీర్ హోటళ్ల నిర్మాణాలకు సబ్సిడీలు అందించడంలో నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపిస్తూ సీబీఐ పెన్నా సిమెంట్స్‌కు చెందిన పెన్నా ప్రతాప్ రెడ్డిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.ఈ కేసులో నిందితురాలిగా ఉన్న అప్పటి పరిశ్రమల కార్యదర్శి వై. శ్రీలక్ష్మి తనపై ఉన్న కేసును కొట్టివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరపగా, సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా మాట్లాడుతూ, శ్రీలక్ష్మి గతంలో సీబీఐ కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుని పిటిషన్ దాఖలు చశారని తెలిపారు.ఇరుపక్షాల వాదనలు పూర్తయి తీర్పును రిజర్వ్ చేసిన తర్వాత పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లు ఆయన తెలిపారు. అంటే, అవి తుది ఆదేశాలు అని, అదే కాగ్నిజెన్స్ ఉత్తర్వులను సవాలు చేస్తూ మళ్లీ పిటిషన్ దాఖలు చేయడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల పై అభ్యంతరాలు ఉంటే, వాటిని ఈ కోర్టులో కాకుండా కింది కోర్టులో తేల్చుకోవాలని అన్నారు. అందువల్ల, పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు.

## రైతులకు ప్రభుత్వ పథకాలు చేరేలా పటిష్ట చర్యలు...

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**వ్యవసాయ శాఖ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 17( వార్త సంధ్య) :** రైతులకు ప్రభుత్వ పథకాలు చేరేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో. వ్యవసాయ శాఖ పనితీరు పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఎరువుల బుకింగ్ యాప్ ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రతి రైతుకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉంచాలని, అవసరానికి మించి అధికంగా యూరియా వాడకుండా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. రైతు బీమా పథకం కింద అర్హులైన రైతులందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రైతు బీమా కింద రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు ఏ కారణం చేత మరణించినప్పటికీ వారి కుటుంబానికి 5 లక్షల రూపాయల బీమా సొమ్ము వెంటనే అందుతుందని, ఈ పథకం అమలులో ఎటువంటి నిర్లక్ష్యం వహించ వద్దని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రైతు నమోదు కార్యక్రమం (ఫార్మర్ రిజిస్టర్) క్రింద ప్రతి రైతు తప్పనిసరిగా రిజిస్టర్ అయ్యే విధంగా చూడాలని, ఈ ప్రక్రియలో ఏదైనా రైతు పేరు నమోదు కాని పక్షంలో వారికి పీఎం కిసాన్ సమాన్ నిధి సంబంధించిన కేంద్ర ప్రభుత్వం అందించే సహాయం అందకుండా పోతుందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలు మన రైతులకు తప్పనిసరిగా చేరేలా జిల్లా యంత్రాంగం కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఎంటర్ ప్రెన్యూర్స్ గా రాణించేందుకు కామన్ ఫెసిలిటీ సెంటర్స్ ఏర్పాటు చేస్తాము : ఎంపీ కేశినేని శివనాథ్

**ఎన్.ఐ.ఆర్.డి లో శిక్షణ పొందిన మహిళలతో ఎంపీ సమావేశం**

**ఈ సమావేశానికి హ్యాండ్ మేడ్ పేపర్ ప్రొడక్ట్స్, హోమ్ బేస్ట్ ప్రొడక్ట్స్ , బ్రిక్స్ తయారీ పై శిక్షణ పొందిన మహిళలు హాజరు**




**కృష్ణాజిల్లా బ్యూరో ఫిబ్రవరి 17 వార్త సంధ్య విజయవాడ :** కేశినేని ఫౌండేషన్ ద్వారా హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి లో స్వయం ఉపాధికి సంబంధించి నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన మహిళలు ఎంటర్ ప్రెన్యూర్స్ గా రాణించేందుకు కామన్ ఫెసిలిటీ సెంటర్స్ ఏర్పాటు చేయటంతోపాటు మార్కెటింగ్ పరంగా కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ హ్యాండ్ మేడ్ పేపర్ ప్రొడక్ట్స్, హోమ్ బేస్ట్ ప్రొడక్ట్స్ , బ్రిక్స్ తయారీ పై శిక్షణ పొందిన మూడు గ్రూపుల మహిళలతో గ్రూపుల వారీ గా విడివిడిగా సమావేశం అయ్యారు. మహిళలు తాము తయారు చేసిన వస్తువులను ఎంపీ కేశినేని శివనాథ్ కి చూపించారు. ఆ వస్తువుల నాణ్యత, భద్రత ల కోసం తీసుకున్న జాగ్రత్తల గురించి ఎంపీ కేశినేని శివనాథ్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన మహిళలు తమకి రా మెటీరియల్ కొనుగోలు విషయంలో, మార్కెటింగ్ పరంగా, మెషినరీ కి సంబంధించి సహకారం అందించాలని ఎంపీ కేశినేని శివనాథ్ ను కోరారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ శిక్షణ పొంది వస్తువులు తయారు చేస్తున్న మహిళలకు మరింతగా ప్రోత్సహకం అందించే విధంగా తాము చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. . ఒకే రకమైన వస్తువులు తయారు చేసే వారందరికీ ఉపయోగపడే విధంగా కామన్ పెసిలిటీ సెంటర్స్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటి ంచారు. ఈ కామన్ ఫెసిలిటీ సెంటర్స్ ను ఏర్పాటు చేయటానికి వేగవం తంగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అలాగే తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ కల్పించే విధంగా..వారు ఆర్థికంగా మరింత ఉన్నత స్థానంలో వుండే విధంగా కావాల్సిన సదుపాయాలు కల్పించటంతో పాటు , ఎటువంటి సహాయ సహకారాలు అందించటానికైనా ముందు వుంటామని తెలిపారు. ఇంటి ఒక ఎంటర్ ప్రెన్యూర్ వుండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాన్ని స్ఫూర్తిగా తీసుకుని మహిళలను ఎంటర్ ప్రెన్యూర్స్ గా తీర్చిదిద్దేందుకు కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎన్.ఐ.ఆర్.డి లో పలు విభాగాల్లో శిక్షణ ఇప్పించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఐ.ఆర్.డి అధికారి మురళీకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి రూరల్ కో ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి అర్బన్ కో ఆర్డినేటర్ వల్లభనేని నరసింహాచౌదరి, ఎన్టీఆర్ జిల్లా సమైక్య అధ్యక్షురాలు కందుల కల్పన, ప్రధాన కార్యదర్శి రామలక్ష్మీ, విజయవాడ రూరల్ సమైక్య అధ్యక్షురాలు సుహాసిని, సెక్రటరీ విజయలక్ష్మీ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార భవన్ ఎదుట (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆందోళన

**చిన్న పత్రికలపై సర్కారు వివక్ష చూపుతుంది.**

**ఆర్‌యన్‌ఐ,పిఆర్‌జిఐ అనుమతి పొందిన**

**ప్రతి పత్రికకు అక్రిడేషన్ మంజూరు చేయాలి.**

**ధర్నా అనంతరం అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ జగన్‌కు వినతి పత్రం అందజేసిన అధ్యక్షుడు మామిడి సోమయ్య.**





**హైదరాబాద్, ఫిబ్రవరి 17 ( వార్త సంధ్య) :** కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఆర్ఎన్ఐ, పీఆర్‌జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన చిన్న, మధ్య తరహా పత్రికలకు అక్రెడిటేషన్లు ఇవ్వకుండా, ఎంప్యానల్‌మెంట్ పేరుతో వివక్ష చూపుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం జర్నలిస్టులు రోడ్డెక్కారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని సమాచార భవన్ ఎదుట భారీ ఆందోళన చేపట్టారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఇచ్చిన "ఛలో సమాచార భవన్" పిలుపు మేరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన చిన్న, మధ్య తరహా పత్రికల నిర్వాహకులు, పాత్రికేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ర్యాలీగా సమాచార భవన్‌కు చేరుకున్న జర్నలిస్టులు దాదాపు రెండు గంటల పాటు కార్యాలయ ప్రవేశ ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత స్వరాష్ట్రంలోనే చిన్న, మధ్య తరహా పత్రికల అణచివేత కొనసాగుతుందని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించినప్పటికీ, కేవలం ఎంప్యానల్‌మెంట్ పొందిన కొద్దిమంది పత్రికలు, చానళ్లకే పరిమితం చేయడం ద్వారా మిగతా పత్రికలకు తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ఎంప్యానల్‌మెంట్‌తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు, వాటి సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేవారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ విధానాన్ని పూర్తిగా విస్మరించి, నిబంధనల ముసుగులో చిన్న, మధ్య తరహా పత్రికలను పక్కన పెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ తొలి ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు జరిగిన అన్యాయంపై గొంతెత్తిన వారే, అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా అదే వివక్ష కొనసాగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఆర్ఎన్ఐ, పీఆర్‌జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను రెండేళ్లుగా ఎంప్యానల్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తూ, కనీసం అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకుండా అణిచివేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు ఇప్పటికే ఎంప్యానల్‌మెంట్ జాబితాలో ఉన్న పత్రికలను కూడా ఆ జాబితా నుంచి తొలగించడం జర్నలిస్టులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. ఒకప్పుడు దరఖాస్తు చేస్తే అడ్వర్టయిజ్మెంట్‌తో పాటు అక్రెడిటేషన్ ఇచ్చే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు కనీసం అక్రెడిటేషన్ కార్డు కూడా ఇవ్వకపోవడం దుర్మార్గమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ వివక్ష వల్ల స్వరాష్ట్రంలో చిన్న పత్రికల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని, దీని ప్రభావం ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులు, వారి కుటుంబాలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టుగా ఎంప్యానల్‌మెంట్ తొలగింపులు మరింత బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి, ఆర్ఎన్ఐ, పీఆర్‌జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన ప్రతి పత్రికకు గతంలో మాదిరిగానే అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఎంప్యానల్‌మెంట్‌తో సంబంధం లేకుండా నెలకు కనీసం ఒక అడ్వర్టయిజ్మెంట్ ఇవ్వాలని, ప్రింటింగ్ ప్రెస్‌ల కోసం ప్రభుత్వ నామినల్ ధరకు ఒక ఎకరం భూమి కేటాయించి, రుణ సదుపాయం కల్పించాలని కోరారు. అలాగే జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఆర్టీసీ బస్ పాస్, హెల్త్ కార్డులు, భీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు తన్నీరు శ్రీనివాస్, కె. పాండురంగారావు, పద్మనాభరావు, యర్రమిల్లి రామారావు, హైదరాబాద్ జిల్లా నాయకులు వి. రవికుమార్, శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మం, సంతోష్, వార్త సంధ్య ఎడిటర్ సెగ్గెం కిరణ్ కుమార్ ,వివిధ పత్రికల ఎడిటర్స్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, గడ్డమీది అశోక్, నల్గొండ, వరంగల్, నిజామాబాద్, సూర్యాపేట జిల్లాల నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ జగన్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జర్నలిస్టులు సమర్పించారు.

## ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న పత్రికలకూ అక్రెడిటేషన్లు ఇవ్వాలి

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (వార్త సంధ్య ) :** కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఆర్ఎన్ఐ, పీఆర్‌జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన చిన్న, మధ్య తరహా పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. మంగళవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని పలువురు ఫెడరేషన్ నాయకులతో కలిసి మామిడి సోమయ్య కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పదేళ్లుగా స్వరాష్ట్రంలోనే చిన్న, మధ్య తరహా పత్రికల అణచివేత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలోనైనా ఈ వివక్షకు ముగింపు పలికి న్యాయం చేయాలని మంత్రిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించినప్పటికీ, కేవలం ఎంప్యానల్‌మెంట్ పొందిన కొన్ని పత్రికలు, చానళ్లకే పరిమితం చేయడం వల్ల ఆర్ఎన్ఐ, పీఆర్‌జీఐ గుర్తింపు ఉన్న అనేక పత్రికలు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. ఎంప్యానల్‌మెంట్ అనేది కేవలం ప్రభుత్వ అడ్వర్టయిజ్మెంట్లకు మాత్రమే సంబంధించినదని, అక్రెడిటేషన్‌కు దీనిని అనుసంధానం చేయడం తగదని మంత్రికి వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ఎంప్యానల్‌మెంట్‌తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు, వాటి సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేసేవారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ విధానాన్ని విస్మరించడం వల్ల చిన్న, మధ్య తరహా పత్రికలు, అందులో పనిచేస్తున్న జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్ఎన్ఐ, పీఆర్‌జీఐ గుర్తింపు ఉన్న ప్రతి పత్రికను ఎంప్యానల్ చేయాలని, అలాగే ఆయా పత్రికల జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రింటింగ్ ప్రెస్‌ల కోసం ప్రభుత్వ నామినల్ ధరకు ఒక ఎకరం భూమి కేటాయించి, ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు కోసం రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాతో పరిమితం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని, హెల్త్ కార్డులు, భీమా సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేశారు. మంత్రిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మం, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పాల్వాయి జానయ్య, కార్యదర్శి హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


# ‘నాకు సహకరిస్తే నేను నీకు సహకరిస్తా’

**పదవుల కోసం వైరం పక్కనపెట్టిన రాజకీయ పార్టీలు**

**స్థానిక పరిస్థితుల మేరకు వ్యవహరించిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ**

**ఒకచోట భాజపా, భారాస- మరోచోట భారాస, కాంగ్రెస్ ఏకం**

**బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం, స్వతంత్రుల మద్దతుతో ఛైర్‌పర్సన్‌గా ఎన్నిక**




మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల్లో నాకు సహకరిస్తే నేను నీకు సహకరిస్తే అనే రీతిలో రాజకీయపార్టీలు వ్యవహరించాయి. పదవుల కోసం అధికార- విపక్షాలు వైరాన్ని పక్కనపెట్టాయి. ఒకచోట బీజేపీ-బీఆర్ఎస్, మరోచోట బీఆర్ఎస్ - కాంగ్రెస్ ఇంకో చోట కాంగ్రెస్, బీజేపీ కలిసి ముందడుగు వేశాయి. మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్‌పర్సన్ ఎన్నికకి రాజకీయాల్లో ఒకరికి ఒకరు శత్రువులుగా భావించే పార్టీలు పరోక్షంగా మద్దతు ప్రకటించుకున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ స్థానిక రాజకీయ పరిస్థితుల మేరకు వ్యవహరించాయి. ఒకచోట బీజేపీ, బీఆర్ఎస్ మరోచోట బీఆర్ఎస్, కాంగ్రెస్ ఇంకో చోట కాంగ్రెస్, బీజేపీ కలిసి ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ స్థానాలు దక్కించుకున్నాయి.

**బీజేపీ గెలిచినా దక్కని ఛైర్‌పర్సన్ పదవి :** ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అధిక స్థానాల్లో బీజేపీ గెలిచినా ఛైర్‌పర్సన్ పదవిని దక్కించుకోలేకపోయింది. కాంగ్రెస్ తిరుగుబాటు కౌన్సిలర్ బండారి అనూష హస్తంశిబిరానికి రావడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం, స్వతంత్ర అభ్యర్థులు మద్దతివ్వగా ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఎంఐఎం కౌన్సిలర్ మహ్మద్ రోహిత్ వైస్‌ఛైర్‌పర్సన్ అయ్యారు. ఎంఐఎం కంచుకోటగా ఉన్న భైంసాలో ఈ సారి బీజేపీ తిరుగుబాటు అభ్యర్థి తోముల దత్తారాం ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. 26 వార్డుల్లో ఎంఐఎం-12 గెలిచినా బీజేపీ, కాంగ్రెస్, స్వతంత్రులు కలిసి ఛైర్‌పర్సన్‌గా దత్తారాం, వైస్‌ఛైర్‌పర్సన్‌గా ఎంఐఎం తిరుగుబాటు కౌన్సిలర్ సిద్ధికికి మద్దతు పలికారు.

**ఎక్స్‌అఫీషియో ఓటుతో ఛైర్‌పర్సన్ పదవి :** నర్సాపూర్‌లో కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 5, బీజేపీ 4 వార్డులు గెలుపొందాయి. ఇక్కడ బీజేపీ అభ్యర్థులు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపి వైస్‌ఛైర్‌పర్సన్ పదవి తీసుకున్నారు. మెదక్‌లో కాంగ్రెస్‌కు బీజేపీ పరోక్షంగా మద్దతిస్తూ గైర్హాజరు కాగా అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎక్స్‌అఫీషియో ఓటుతో ఛైర్‌పర్సన్ పదవి దక్కించుకుంది. ఇస్నాపూర్‌లో ఎంపీ రఘునందన్‌రావు ఎక్స్‌అఫీషియో ఓటు బీఆర్ఎస్‌కి వేయగా ఛైర్‌పర్సన్ పదవిని గులాబీ పార్టీ గెల్చుకుంది. జిన్నారంలో బీఆర్ఎస్-8, బీజేపీ-4, కాంగ్రెస్-6 సీట్లు వచ్చాయి. ఇక్కడ బీఆర్ఎస్‌కి బీజేపీ మద్దతుపలకడంతో ఛైర్‌పర్సన్ పదవి బీఆర్ఎస్, వైస్ ఛైర్‌పర్సన్ పదవి బీజేపీ తీసుకున్నాయి.

**ఆమనగల్లో సహకరించుకున్న కాంగ్రెస్, బీజేపీ :** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీజేపీ సహకరించుకున్నాయి. ఇక్కడ 15 వార్డుల్లో కాంగ్రెస్-1, బీఆర్ఎస్ 8, బీజేపీ 6 వార్డులుదక్కాయి. కాంగ్రెస్‌కి బీజేపీ మద్దతిచ్చింది. బీఆర్ఎస్ నుంచి ఒకరు బయటకు రావడంతో ఆ కౌన్సిలర్‌ను ఛైర్‌పర్సన్‌గా ప్రకటించారు. ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో ఓటుతో ఆ పురపీఠాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. వైస్‌ఛైర్‌పర్సన్ పదవిని బీజేపీ పొందింది. కామారెడ్డి మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏకమై ఛైర్‌పర్సన్ పదవిని దక్కించుకున్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అలియాబాద్‌లో బీజేపీ, కాంగ్రెస్ ఏకమయ్యాయి.

**అలియాబాద్‌లో ఏకమైన బీఆర్ఎస్, కాంగ్రెస్ :** వనపర్తి జిల్లా అమరచింతలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మూడు చొప్పున వార్డులు గెలిచాయి. సీపీఎం ఒక వార్డులో విజయంసాధించింది. సీపీఎం కౌన్సిలర్ కాంగ్రెస్‌కి మద్దతిచ్చారు. ఆ సమయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ సువర్ణ హస్తం పార్టీలో చేరగా ఆమెను ఛైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ ప్రకటించింది. మంత్రి వాకిటి శ్రీహరి ఎక్స్‌అఫీషియో ఓటుతో ఆ స్థానాన్ని అధికార కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కామారెడ్డి మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏకమై ఛైర్‌పర్సన్ పదవిని దక్కించుకున్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అలియాబాద్లో బీజేపీ, కాంగ్రెస్ ఒకటైయ్యారు. ఈ ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు జరిగాయి. ఒక పార్టీకి మరో పార్టీకి మద్దతు ఇవ్వడమే కాకుండా స్వతంత్రులకు భారీ మొత్తాలు చెల్లించి వారి వైపు తిప్పుకునే ప్రయత్నం చేసి కొన్ని స్థానాలో విజయం గెలిచారు. మరి కొన్ని చోట్ల ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ చేసి పంచుకొన్నారు. మొత్తంమీద అన్ని పార్టీల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులు ఛైర్మన్లు అయ్యారు.

# ఖాళీ బిస్కెట్ ప్యాకెట్లలో డ్రగ్స్

**ఈగల్ టీమ్‌కు దొరికిన గ్యాంగ్**

**హైదరాబాద్ నగరంలో ఖాళీ బిస్కెట్ ప్యాకెట్లలో డ్రగ్స్ సరఫరా**

**అంతరాష్ట్ర ముఠా అరెస్టు చేసిన ఈగల్ ఫోర్స్**

**కొండాపూర్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు**



తిని పారేసిన ఖాళీ బిస్కెట్ ప్యాకెట్లలో డ్రగ్స్ నింపి డెడ్ డ్రాప్ విధానంలో విక్రయిస్తు అంతరాష్ట్ర మాదకద్రవ్యాల ముఠా గుట్టును తెలంగాణ ఈగల్ ఛేధించింది. నగరంలో ఈ ముఠా నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రగ్స్‌ను విసిరేసి, వినియోగదారులకు ఆ లొకేషన్ వివరాలను వాట్సాప్ ద్వారా పంపిస్తుంది. గత కొన్ని నెలలుగా గ్యాంగ్ మీద నిఘా పెట్టిన ఈగల్ పోలీసులు సోమవారం ఎట్టకేలకు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ముగ్గురిని అరెస్ట్ చేసి 15 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద నుంచి 15 మంది డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు ఈగల్ టీమ్ గుర్తించింది.

**పూర్తి వివరాలు ఇలా :** ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వేగేశ్న మురళీ కృష్ణంరాజు ప్రస్తుతం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక సమస్యలు, ఇతర కారణాలతో ఇంజినీరింగ్ కోర్సు మధ్యలోనే వదిలేశాడు. ఆ తర్వాత ఉత్తరాఖండ్, పుణె, గోవా తదితర ప్రాంతాల్లో తాత్కాలిక ఉద్యోగాలు చేశాడు. రాజుకు ఇలా ఎన్ని పనులు చేసిన డబ్బులు మాత్రం సరిపోవడం లేదని మదనపడుతూ సిగరెట్లు, మద్యానికి అలవాటు పట్టాడు. ఈ నేపథ్యంలో డ్రగ్స్ వాడకం కూడా మొదలు పెట్టాడు. ఆ తర్వాత విలాసవంతమైన జీవితాన్ని వదులుకోలేక తానే సొంతంగా డ్రగ్స్ విక్రయాలు స్టార్ట్ చేశాడు.

**బెంగళూరు అడ్డాగా :** కొన్ని సంవత్సరాల క్రితం మణికొండలో ఓ పాత నేరస్థుడి వద్ద గ్రాము కొకైన్ రూ. 10 వేల చొప్పున కొనుగోలు చేసి దానిని రూ. 11వేలకు ఇతరులకు అమ్మేవాడు. ఈ క్రమంలో ఆ పాత నేరస్థుడిని పోలీసులు అరెస్టు చేయడంతో మరో మార్గాన్ని ఎంచుకున్నాడు. గోవాలో ఉండే నైజీరియన్ క్లిఫర్డ్, బెంగళూరులోని మరొకరితో పరిచయం పెంచుకుని కొకైన్ రూ.7 వేలకు తీసుకుని రూ. 12 వేలకు విక్రయించేవాడు. ఇలా డ్రగ్స్ అమ్మే సమయంలో మురళీ కృష్ణంరాజు తన పేరు ఇతర వివరాలు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకునేవాడు.

**వాట్సప్ ఫోటోల ద్వారా విక్రయాలు :** నిందితుడు మురళీ కృష్ణంరాజు కేవలం వాట్సాప్ ద్వారా మాత్రమే కస్టమర్స్‌కి అందుబాటులో ఉంటాడు. ఆ వాట్సాప్‌ని కూడా వైఫై సౌకర్యం ఉండే ప్రాంతాల్లోనే ఉపయోగిస్తాడు. ఖాళీ బిస్కెట్ ప్యాకెట్లలో కొకైన్‌ని నింపి నగరంలోని నిర్మానుష్య ప్రాంతంలో విసిరేస్తాడు. ఆ తర్వాత ఫోటో, అక్కడి లొకేషన్ వినియోగదారులకు వాట్సాప్ ద్వారా షేర్ చేస్తాడు. ఇక నగదు విషయానికొస్తే నేరుగా తీసుకోకుండా తన మిత్రుల బ్యాంకు అకౌంట్లకు బదిలీ చేయించుకుని వేర్వేరు మార్గాల్లో తీసుకునేవాడు.

**డ్రగ్స్ సరఫరా ఎలా ఉంటుందంటే? :** మురళీకృష్ణకు బెంగళూరులో ఉండే తేజస్ అనే వ్యక్తి డ్రగ్స్ కొనేందుకు సహాయం చేసేవాడు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో హైదరాబాద్‌కు చేరవేసేవాడు. అంతేకాదు తన సమీప బంధువు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కేపీహెచ్‌బీలో ఉండే వ్యాపారి రుద్రరాజు హేమంత్ రాజు, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కొండాపూర్‌లో ఉంటున్న ఓ ప్రైవేటు ఉద్యోగి భూపతిరాజు చిరంజీవి వర్మ ఇద్దరూ కలిసి డ్రగ్స్ విక్రయించడానికి సహాయపడేవారు. గత కొన్ని రోజులుగా ఈ ముగ్గురి గురించి ఈగల్ పోలీసులు సమాచారం అందుకున్నారు.

**ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు :** కొండాపూర్‌లోని వెంకటరమణ రెసిడెన్సీలో సోమవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అదుపులోకి తీసుకుంది. ఆ డ్రగ్స్ కిట్లతో పరీక్షించగా ముగ్గురికి పాజిటివ్ అని తేలింది. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి, ముగ్గురి నుంచి డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న 15 మందిని గుర్తించారు. ప్రస్తుతం వారి ఫోన్ నెంబర్లు సేకరించి ఆరా తీస్తున్నారు. బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకురావడంలో సహకరించిన జబ్బార్ ట్రావెల్స్ డ్రైవర్‌ను ఈ కేసులో నిందితుడిగా చేర్చారు. అలాగే డ్రగ్స్ తీసుకెళ్లిన ర్యాపిడో డ్రైవర్ పేరును సైతం నిందితుల జాబితాలో చేర్చారు. ఇంకా ఎవరెవరికీ విక్రయిస్తున్నాడో ఆరా తీస్తున్నారు.

# సినీనటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు

**నిందితుడు లొంగిపోవాలని ఆదేశం**

**నిందితుడు సిద్ధార్థరెడ్డి పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు**

**నిందితుడు సిద్ధార్థరెడ్డి లొంగిపోవాలని సుప్రీంకోర్టు ఆదేశం**

**సిద్ధార్థరెడ్డికి 4 వారాల సమయం ఇచ్చిన సుప్రీంకోర్టు**



సినీనటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. నిందితుడు సిద్ధార్థరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. సిద్ధార్థరెడ్డి లొంగిపోవాలని సుప్రీంకోర్టు 4 వారాల సమయం ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. గతంలో హైకోర్టు ఖరారు చేసిన శిక్షను సుప్రీంకోర్టు సమర్థించింది.

**కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు :** ఇంటర్ చదువుతున్నప్పుడు ప్రత్యూష, సిద్ధార్థరెడ్డి ప్రేమలో పడ్డారు. ఇంటర్ పూర్తయ్యాక ప్రత్యూష సినిమాల్లోకి వెళ్లాక, సిద్ధార్థరెడ్డి ఇంజినీరింగ్‌లో చేరాడు. తమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. 2002 ఫిబ్రవరి 23న ఇద్దరూ విషం తాగిన పరిస్థితిలో ప్రైవేటు ఆసుపత్రిలో చేరడం అప్పట్లో కలకలం సృష్టించింది. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ 2002 ఫిబ్రవరి 24న ప్రత్యూష ప్రాణాలు విడించారు. చికిత్స తర్వాత మార్చి 9న సిద్ధార్థ రెడ్డి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి తాగినట్లు టెస్ట్‌లో పోలీసులు గుర్తించారు. ఆర్గానోఫాస్ఫేట్ అనే రసాయనం కారణంగా ప్రత్యూష మరణించారని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ముగ్గురు వైద్యుల బృందం నివేదిక ఇచ్చింది. అందులో ఊపిరాడకుండా చేయడం, మరణానికి ముందు ఆమెపై లైంగిక దాడి వంటివి జరగలేదని తెలిపింది.

**ఆత్మహత్యకు ప్రేరేపించేలా :** 2002లో సినీనటి ప్రత్యూష మృతి సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే 2004లో ప్రత్యూష మృతిని పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఆత్మహత్యకు ప్రేరేపించేలా సిద్ధార్థరెడ్డి వ్యవహరించారని ట్రయల్ కోర్టు సైతం తేల్చింది. ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ట్రయల్ కోర్టు తీర్పు ఇవ్వగా నిందితుడు సిద్ధార్థ రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై పలు దఫాల్లో విచారణ చేపట్టి హైకోర్టు 2011లో ఐదేళ్ల జైలు శిక్షను రెండేళ్లకు కుదించి, రూ.50 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. దీంతో ఆ తీర్పును సైతం సిద్ధార్థ రెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

**ఐదేళ్ల కఠినకారాగార శిక్ష :** సీబీఐ చేసిన దర్యాప్తు ఆధారంగా నిందితుడు సిద్ధార్థ రెడ్డిపై 306 (ఆత్మహత్యకు పురికొల్పడం), 309 (ఆత్మహత్యకు యత్నించడం) సెక్షన్ల కింద ఛార్జిషీట్ దాఖలు చేసింది. దీంతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ 2004 ఫిబ్రవరి 23న తీర్పు వెలువరించారు. దీనిపై సిద్ధార్థరెడ్డి హైకోర్టును ఆశ్రయించగా జైలుశిక్షను రెండేళ్లకు తగ్గిస్తూ, జరిమానాను రూ.50 వేలకు పెంచుతూ 2011 డిసెంబరు 28న తీర్పు ధర్మాసనం తీర్పు ఇచ్చింది.

**పోస్టుమార్టం తీరుపై అసంతృప్తి :** ఈ కేసుపై సిద్ధార్థరెడ్డి, ప్రత్యూష తల్లి సరోజినీదేవి 2012లో సుప్రీంకోర్టులో వేర్వేరుగా అప్పీల్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ఇటీవల విచారణ చేసిన అత్యన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా నిందితుడు సిద్ధార్థ రెడ్డి నాలుగు వారాల్లోపు లొంగిపోవాలంటూ తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం సమర్థించింది. ప్రత్యూష కేసులో పోస్టుమార్టం జరిగిన తీరుపై అసంతృప్తి తెలిపింది. పోస్టుమార్టం నిర్వహించిన పద్ధతి సరిగా లేదన్న ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.

**కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడు మృతి :** ప్రత్యూష 1988లో చిత్రసీమలో అడుగు పెట్టింది. ప్రత్యూష ఇండస్ట్రీకి పరిచయమైన అనతి కాలంలోనే నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును తన ఖాతాలో వేసుకుంది. కలుసుకోవాలని, రాయుడు, సముద్రం వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో హీరోయిన్‌గా తన సత్తా చాటింది. హీరోయిన్‌గా కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడు ప్రత్యూష హఠాన్మరణం అభిమానుల్లో తీవ్ర విషాదం మిగిల్చింది.


# ఇకపై ‘ఆంధ్రా యాత్రి’తో సేఫ్ రైడ్స్

**ఇది ప్రభుత్వ యాప్**

**ప్రజలకు తక్కువ ధరకే సేవలు అందేలా ప్రణాళిక**

**పీపీపీ విధానంలో ఏర్పాటుకు రవాణా శాఖ కసరత్తు**

**ప్రైవేటు యాప్‌లకు పోటీగా అందుబాటులోకి తెచ్చే యత్నం**




సిటీలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాలంటే చాలా వరకు ఎక్కువ మంది మొబైల్ యాప్‌లో ఆటో, టాక్సీ, బైక్ ఇలా తమకు అవసరమైంది బుక్ చేసుకుంటారు. ఒకరి కంటే ఎక్కువ మంది అయితే ఆటో, కారు, ఒక్కరే వెళ్లాల్సి వస్తే బైక్ ట్యాక్సీని బుక్ చేసుకుంటున్నారు. ఇలా అవసరానికి రైడ్స్ బుక్ చేసుకోవాలంటే మన కోసం అందుబాటులో ఉన్నవి అన్నీ ప్రైవేటు యాప్‌లే. ఈ నేపథ్యంలో ‘ఆంధ్రా యాత్రి’ పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఓ యాప్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు రచిస్తోంది. దీనికోసం ఆన్‌లైన్‌లో ఫ్లాట్ ఫామ్ నిర్వహణ, తదితరాల అవసరాల కోసం గుత్తేదారును ఎంపిక చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు, భాగస్వామ్యం) విధానం కింద ఈ యాప్‌ను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

**చందా రుసుము చెల్లిస్తే చాలు:** ఈ యాప్ ద్వారా బైక్, ఆటో, కారు ట్యాక్సీ డ్రైవర్లు రైడ్స్ పొందాలనుకున్న వాళ్లు దీనికోసం నామమాత్రపు చందా రుసుము చెల్లిస్తే సరిపోతుంది. ఒక్కో బైక్ ట్యాక్సీ ట్రిప్‌కి గరిష్ఠంగా రూ.3, రూ.5 తో ఆటో, రూ.11 కారు కోసం చందా రుసుము ఉంటుంది. ఆయా వాహనాన్ని బట్టి రోజు మొత్తానికి రూ.30 నుంచి రూ.50 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎన్ని రైడ్స్ అయినా పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ప్రైవేటు యాప్స్‌లో డ్రైవర్ కమీషన్‌గా ప్రతి రైడ్‌కు తాను పొందే డబ్బు మొత్తంలో 20 శాతం వరకు యాప్ వారికే చెల్లించాల్సి వస్తోంది. ఇటువంటిదేదీ ‘ఆంధ్రా యాత్రి‘ యాప్‌లో ఉండదు. కేవలం ముందుగా రైడ్స్ పొందేందుకు చందా రుసుము మాత్రమే తీసుకుంటారు.

**టెండర్ కోట్ ఇదే:** యాప్ నిర్వహణ గుత్తేదారు ఈ విధంగా వసూలైన చందా డబ్బుల నుంచి 10 శాతం మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ యాప్ కోసం ప్రచారం బ్రాండింగ్ వంటి మిగిలిన వాటన్నింటికి అయ్యే మొత్తాన్ని రాష్ట్ర రవాణాశాఖ వినియోగిస్తుంది. ఈ యాప్‌నకు చెందిన ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ నిర్వహణకు బిడ్లు ఆహ్వానించనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. దీనికోసం వాహన యజమానుల నుంచి ఎవరైతే తక్కువ చందా రుసుం తీసుకుని, ఈ యాప్‌ను నిర్వహిస్తామంటూ కోట్ చేస్తారో వారికే టెండరు కేటాయించనున్నట్లు తెలుస్తుంది.

**అన్ని శాఖలను కలుపుతూ:** రవాణా శాఖతో పాటు ఈ యాప్‌తో, ఆర్టీసీ, పోలీస్, కార్మిక శాఖలు, టూరిజం, ఆర్టీజీఎస్‌ను కూడా అనుసంధానం చేస్తారు. అన్ని శాఖల పర్యవేక్షణ ఉండడంతో రైడ్ బుక్ చేసుకున్న వారికి సురక్షితమైన ప్రయాణం లభిస్తుంది. డ్రైవర్ల నుంచి ఎటువంటి కమీషన్ వసూలు చేయకపోవడంతో వల్ల ప్రయాణికులకు కూడా రైడ్స్ కొంత వరకు తక్కువ ధరకే లభిస్తాయి. ఇందులో రియల్‌టైమ్ ట్రాకింగ్ తదితరాలన్నీ ఉంటాయి.ప్రయోగాత్మకంగా ఆ13 జిల్లా కేంద్రాల్లో : ఒకప్పటి ఉమ్మడి జిల్లా కేంద్రాలైన తిరుపతి, విజయవాడ నగరాల్లో ముందుగా ఈ ‘ఆంధ్రా యాత్రి’ ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. ఇక్కడ ప్రయోగాత్మకంగా చేసిన అనంతరం ఇతర పట్టణాల్లో కూడా ఈ యాప్‌ను అందుబాటులోకి తెనున్నట్లు తెలుస్తుంది. ఇందుకోసం పాలసీ రూపొందిస్తున్నారు. దాంట్లే నియమ నిబంధనలు ఖరారు చేసి, ఆపై టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో గతంలో కేంద్ర ప్రభుత్వం ఇదే విధానంలో ‘భారత్ యాత్రి’ అనే యాప్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించింది. ఏపీలో కూడా దీనిని భవిష్యత్తులో అమలు చేస్తారు. ‘ఆంధ్రా యాత్రి’ యాప్‌ని అందులో విలీనం చేస్తారు.

# జగన్ అక్రమాస్తులు, ఓఎంసీ కేసులో ఐఏఎస్ శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

**శ్రీలక్ష్మి పాల్పడిన అక్రమ వ్యవహారాలన్నీ ట్రయల్‌లోనే బయటపడుతాయన్న దర్యాప్తు సంస్థ**

**సీబీఐ వాదనను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు**

**శ్రీలక్ష్మి పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన ధర్మాసనం**



జగన్ అక్రమాస్తులతో పాటు గాలిజనార్ధన్‌రెడ్డికి చెందిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి గనుల కేటాయింపు కేసుల్లో సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ రెండు కేసుల నుంచి తనను తప్పించాలంటూ శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టేస్తూ తెలంగాణ హైకోర్ట్ గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది.ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి నిబంధనలకు అనుగుణంగానే గనులు కేటాయించినట్లు శ్రీలక్ష్మి వివరణ ఇచ్చుకోగా గనులశాఖ కార్యదర్శిగా అనేక ఉల్లంఘనలకు పాల్పడినట్లు సీబీఐ కౌంటర్ ఇచ్చింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి అక్రమంగా గనులు కేటాయించడంలో శ్రీలక్ష్మి కీలకంగా వ్యవహరించారని, క్యాప్టివ్ మైనింగ్ అనే పదాన్ని తొలగించి అక్రమాలకు ఆమే బాటలు వేశారని సీబీఐ స్పష్టం చేసింది. పదవిలో ఉన్నంతకాలం శ్రీలక్ష్మి భారీగా అక్రమాస్తులు కూడబెట్టుకున్నారని వివరించింది. ఆ సమయంలో శ్రీలక్ష్మి మరిది భారీగా అక్రమాస్తులు సంపాదించారని సీబీఐ వెల్లడించింది.డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు: గనులు కేటాయించేందుకు శ్రీలక్ష్మి లంచం కూడా డిమాండ్ చేసినట్టు సాక్షులు వాంగ్మూలం ఇచ్చారని కోర్టుకు తెలిపిన సీబీఐ ఆమె అక్రమాలన్నీ విచారణలోనే తెలుతాయన్నారు. సీబీఐ వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు శ్రీలక్ష్మి వేసిన డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టేసింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. వేరే కేసుగా భావించి ఇందులో తొలుత స్టే ఇచ్చామని, ఇప్పుడు ఆ పొరపాటును సవరిస్తున్నామని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుందరేశ్ అన్నారు. పొరపాటుగా ఇచ్చిన స్టేను నిందితులు ఎంజాయ్ చేశారని వ్యాఖ్యానించారు. విచారణ కొనసాగించాలని ట్రయల్ కోర్టును ఆదేశించారు.మరోవైపు జగన్ అక్రమాస్తుల కేసులో భాగంగా పెన్నా సిమెంట్స్‌కు లీజుల మంజూరు చేయడంలో అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి శ్రీలక్ష్మి అధికార దుర్వినియోగం పై ఆధారాలు ఉన్నాయని సీబీఐ గతంలో స్పష్టం చేసింది. శ్రీలక్ష్మి పై కేసు కొనసాగించడానికి అన్ని ఆధారాలు సేకరించామని తెలంగాణ హైకోర్టుకు నివేదించిన విషయం తెలిసిందే.శ్రీలక్ష్మి పై కేసు కొనసాగించడానికి అన్ని ఆధారాలను సేకరించామని సీబీఐ తెలిపింది. గతంలో స్పష్టం చేసిన ఈ విషయంపై మళ్లీ పిటషన్ దాఖలు వేయడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. అనంతపురం జిల్లా యాకిడిలో 231 ఎకరాల భూ కేటాయింపు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం కౌలపల్లిలో 304.70 హెక్టార్ల లీజును అంచనా వేయడంలో, రంగారెడ్డి జిల్లా తాండూరులో 822.13 ఎకరాల లీజు రెన్యువల్‌తో పాటు హైదరాబాద్‌లో పయనీర్ హోటళ్ల నిర్మాణాలకు సబ్సిడీలు అందించడంలో నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపిస్తూ సీబీఐ పెన్నా సిమెంట్స్‌కు చెందిన పెన్నా ప్రతాప్ రెడ్డిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.ఈ కేసులో నిందితురాలిగా ఉన్న అప్పటి పరిశ్రమల కార్యదర్శి వై. శ్రీలక్ష్మి తనపై ఉన్న కేసును కొట్టివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరపగా, సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా మాట్లాడుతూ, శ్రీలక్ష్మి గతంలో సీబీఐ కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుని పిటిషన్ దాఖలు చశారని తెలిపారు.ఇరుపక్షాల వాదనలు పూర్తయి తీర్పును రిజర్వ్ చేసిన తర్వాత పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లు ఆయన తెలిపారు. అంటే, అవి తుది ఆదేశాలు అని, అదే కాగ్నిజెన్స్ ఉత్తర్వులను సవాలు చేస్తూ మళ్లీ పిటిషన్ దాఖలు చేయడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల పై అభ్యంతరాలు ఉంటే, వాటిని ఈ కోర్టులో కాకుండా కింది కోర్టులో తేల్చుకోవాలని అన్నారు. అందువల్ల, పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు.

# భారత్ ఎగుమతులు పెరిగాయ్

**జనవరిలో రూ.7.30 లక్షల కోట్ల ఎక్స్‌పోర్ట్స్**

**వాణిజ్య లోటు డబుల్ : కేంద్రం**

**2026 జనవరిలో 13.16 శాతం పెరిగిన భారత్ ఎగుమతులు**

**రూ.6.45 లక్షల కోట్ల నుంచి రూ.7.30 లక్షల కోట్లకు జంప్**

**రూ.48వేల కోట్ల నుంచి రూ.94వేల కోట్లకు పెరిగిన వాణిజ్య లోటు**



ఈ ఏడాది జనవరిలోనూ విదేశాలకు భారతదేశ వస్తు, సేవల ఎగుమతులు 13.16 శాతం పెరిగాయి. 2025 జనవరిలో భారత్ రూ.6.45 లక్షల కోట్ల ఎగుమతులు చేయగా, ఈ సంవత్సరం అదే నెలలో రూ.7.30 లక్షల కోట్ల విలువైన ఎగుమతులను సాధించింది. ఇక దిగుమతులు సైతం 18.77 శాతం పెరిగాయి. 2025 జనవరిలో విదేశాల నుంచి భారత్ రూ.6.94 లక్షల కోట్ల విలువైన వస్తు,సేవలను దిగుమతి చేసుకుంది. 2026 జనవరిలో మన దేశం చేసుకున్న దిగుమతుల విలువ మరింత పెరిగి రూ.8.24 లక్షల కోట్లకు చేరింది. ఈవివరాలను కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ సోమవారం మీడియాకు వెల్లడించారు. ఈ సంవత్సరం జనవరిలో భారత్ రూ.94వేల కోట్ల (10.38 బిలియన్ డాలర్ల) వాణిజ్య లోటును ఎదుర్కొందని ఆయన తెలిపారు. 2025 జనవరిలో ఏర్పడిన రూ.48వేల కోట్ల (5.39 బిలియన్ డాలర్ల) వాణిజ్య లోటుతో పోలిస్తే ఇది రెట్టింపు అన్నారు. మొత్తం మీద విదేశాలకు వస్తు,సేవల ఎగుమతిలో భారత్ వేగం కొనసాగిందని రాజేశ్ అగర్వాల్ పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025 - 2026)లో భారత్ మొత్తం ఎగుమతుల విలువ రూ.78 లక్షల కోట్లు (860 బిలియన్ డాలర్లు) దాటే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఇందులో ఒక్క సేవారంగ ఉత్పత్తుల ఎగుమతుల విలువే రూ.37.19 లక్షల కోట్ల దాకా ఉంటుందన్నారు.

**10 నెలల్లో భారత్ సాధించిన ఫలితాలివీ**

“2025 జనవరితో పోలిస్తే 2026 జనవరిలో విదేశాలకు భారతదేశ వస్తువులు, సరుకుల ఎగుమతి విలువ రూ.3.29 లక్షల కోట్ల నుంచి రూ.3.31 లక్షల కోట్లకు పెరిగింది. ఇక ఇదే వ్యవధిలో భారతదేశ సేవారంగ ఉత్పత్తుల ఎగుమతి విలువ రూ.3.15 లక్షల కోట్ల నుంచి రూ.3.98 లక్షల కోట్లకు పెరిగింది. 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి మధ్యకాలంలో రూ.61.59 లక్షల కోట్ల వస్తు,సేవల ఎగుమతులు చేసిన భారత్, 2025 ఏప్రిల్ నుంచి 2026 జనవరి మధ్యకాలంలో రూ.65.38 లక్షల కోట్ల ఎగుమతులు చేసింది. స్థూలంగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి 10 నెలల్లో (2025 ఏప్రిల్ - 2026 జనవరి) భారతదేశ ఎగుమతుల విలువ 6.15 శాతం పెరిగింది. ఈ వ్యవధిలో అదనంగా రూ.3.62 లక్షల కోట్ల ఎగుమతులను మనం సాధించగలిగాం. వస్తు,ఉత్పత్తులతో పాటు సేవల ఎగుమతుల్లోనూ పురోగతిని నమోదు చేశాం” అని కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వివరించారు.

**ట్రేడ్ డీల్‌పై వచ్చే వారం వాషింగ్టన్‌లో చర్చలు**

భారత్ - అమెరికా ట్రేడ్ డీల్‌పై లీగల్ అగ్రిమెంట్‌కు అవసరమైన కార్యాచరణపై వచ్చే వారం వాషింగ్టన్ వేదికగా చర్చలు జరుగుతాయని కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. దీనిపై అమెరికా ప్రతినిధులతో చర్చించేందుకు చీఫ్ నెగోషియేటర్ దర్పణ్ జైన్ సారథ్యంలో భారత ప్రతినిధుల బృందం అమెరికాకు వెళ్తుందని ఆయన తెలిపారు. ప్రస్తుతానికి వాణిజ్య ఒప్పందంపై అమెరికా, భారత్ ప్రతినిధుల మధ్య వర్చువల్‌గా సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ డీల్‌పై లీగల్ అగ్రిమెంట్‌ను రాయడానికి, దానిపై ఇరుదేశాలు ఏకాభిప్రాయానికి రావడానికి కొంత సమయం పడుతుందన్నారు. ఈ ఏడాది మార్చి నెలాఖరు కంటే ముందే అమెరికాతో భారత్ ట్రేడ్ డీల్ కుదిరే అవకాశం ఉందని రాజేశ్ అగర్వాల్ పేర్కొన్నారు. కెనడాతోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునే దిశగా భారత్ ముమ్మర కసరత్తు చేస్తోందన్నారు. దీనితో ముడిపడిన టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌లకు భారత్, కెనడాల ప్రతినిధులు ఇప్పటికే తుదిరూపును ఇచ్చారన్నారు.

**అమెరికా మార్కెట్ భారత్‌లోని ఆ రంగాలకు ఆరోప్రాణం**

“అమెరికా అనేది భారత్‌కు బలమైన మార్కెట్. భారత్‌లోని కార్మిక ఆధారిత రంగాలకు అమెరికా మార్కెట్ ఆరో ప్రాణం లాంటిది. భారత్‌కు చెందిన వస్తు,సేవలపై అమెరికా విధించనున్న 18 శాతం సుంకం విషయానికొస్తే, ఆసియా ఖండంలోనే ఇంతకంటే ఎక్కువ అమెరికా సుంకాలను భరిస్తున్న దేశాలు చాలానే ఉన్నాయి. ఈ సుంకాలను వినియోగదారులు, పరిశ్రమలకు బదిలీ చేస్తే, భారత్‌కు అమెరికా మార్కెట్‌లోకి పూర్తిస్థాయి ప్రవేశం లభిస్తుంది. తప్పకుండా అమెరికా మార్కెట్‌లో ఇతర దేశాలతో భారత వస్తు,ఉత్పత్తులు పోటీపడగలవు. గత క్రిస్మస్ సమయంలో భారత ఎగుమతిదారులు గడ్డుకాలాన్ని చవిచూశారు. అమెరికా మార్కెట్ గిరాకీని వాళ్లు మిస్సయ్యారు. రాబోయే కాలంలో ఈ సమస్య ఉండదు. దేశ రైతులు, మత్స్యకారులు, పాడి రైతులు, డైరీల గురించి ఆలోచించే అన్ని ట్రేడ్ డీల్స్ కుదుర్చుకుంటున్నాం. సున్నిత రంగాలను కాపాడుకుంటున్నాం” అని కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు.

## వరుసగా రెండో రోజు తగ్గిన బంగారం ధర

**రూ. 1,530 తగ్గిన 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం**

**రూ. 1,400 తగ్గిన 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం**

**కేజీ వెండి ధర రూ. 2,65,000**



బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజు కూడా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 5 వేల డాలర్ల నుంచి 4,930 డాలర్లకు పడిపోవడం, డాలర్ విలువలో మార్పులు... ఇవన్నీ కలిసి దేశీయ బులియన్ మార్కెట్‌పై అమిత ప్రభావం చూపాయి.ఈరోజు హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో... 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,530 తగ్గి రూ.1,54,910 వద్ద కొనసాగుతోంది. గత రెండు రోజుల్లో మేలిమి బంగారం 10 గ్రాముల ధర మొత్తం రూ.2,840 తగ్గింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములు రూ.1,400 తగ్గి రూ.1,42,000కు చేరింది. వెండి ధర కూడా భారీగా తగ్గింది. కేజీ వెండి ధర రూ. 2,65,000 వద్ద కొనసాగుతోంది.

## మళ్లీ మొరాయించిన ఎక్స్... ప్రపంచవ్యాప్తంగా యూజర్ల అవస్థలు

**భారత్ సహా పలు దేశాల్లో ఎక్స్ సేవలకు అంతరాయం**

**లాగిన్ సమస్యలు, పోస్టులు లోడ్ కాకపోవడంతో ఇబ్బందులు**

**కొద్ది నెలల్లోనే పలుమార్లు తలెత్తిన సాంకేతిక సమస్యలు**

**అంతరాయానికి కారణంపై స్పందించని ఎక్స్ యాజమాన్యం**



ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్, ఎలాన్ మస్క్ నేతృత్వంలోని ‘ఎక్స్‘ సేవలు సోమవారం సాయంత్రం ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయాయి. భారత్‌తో పాటు అమెరికా, యూకే వంటి అనేక దేశాల్లో యూజర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ అకౌంట్లలోకి లాగిన్ అవ్వలేకపోవడం, కొత్త పోస్టులు లోడ్ కాకపోవడంతో గందరగోళానికి గురయ్యారు. కొద్ది గంటల పాటు కొనసాగిన ఈ అంతరాయంతో ఎక్స్ వేదికపై కార్యకలాపాలు స్తంభించిపోయాయి.టెక్నికల్ సమస్యలను గుర్తించే వెబ్‌సైట్ ‘డౌన్ డిటెక్టర్‘ ప్రకారం, ఈ అంతరాయంపై ఫిర్యాదుల సంఖ్య అనూహ్యంగా 25,000 దాటింది. వీరిలో 53 శాతం మంది ఎక్స్ యాప్ యూజర్లు లాగిన్ సమస్యలను ఎదుర్కొన్నట్లు నివేదించారు. అదే సమయంలో 16 శాతం మంది వెబ్‌సైట్ యూజర్లు కూడా ఇబ్బందులు పడినట్లు డౌన్ డిటెక్టర్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, ఈ సాంకేతిక సమస్యకు కచ్చితమైన కారణం ఏంటనేది వెంటనే తెలియరాలేదు. దీనిపై వివరణ కోరగా ఎక్స్ యాజమాన్యం నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.ఎక్స్ సేవలు నిలిచిపోవడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది నవంబర్‌లో కూడా భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది యూజర్లు ఇలాంటి అంతరాయాన్నే ఎదుర్కొన్నారు. అప్పుడు ‘క్లౌడ్‌ఫ్లేర్‘ ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో తలెత్తిన సమస్య కారణంగా ఎక్స్‌తో పాటు పలు ఇతర వెబ్‌సైట్లు కూడా డౌన్ అయ్యాయి. ఆ సమస్యను తర్వాత క్లౌడ్‌ఫ్లేర్ పరిష్కరించింది. ఆసక్తికరంగా, ఆ సమయంలో డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ కూడా క్లౌడ్‌ఫ్లేర్‌పై ఆధారపడటంతో అది కూడా లోడ్ అవ్వడానికి ఇబ్బంది పడింది.అంతకుముందు, గతేడాది మే నెలలో సైతం ఎక్స్ గ్లోబల్‌గా మొరాయించింది. అప్పుడు కూడా యూజర్లు కొత్త పోస్టులు చూడలేక, లాగిన్ అవ్వలేక ఇబ్బంది పడ్డారు. 24 గంటల వ్యవధిలో రెండుసార్లు సేవలు నిలిచిపోయాయి. ఆ సమయంలో ప్రపంచవ్యాప్తంగా 5,000 మందికి పైగా యూజర్లు సమస్యలను ఎదుర్కొన్నట్లు డౌన్ డిటెక్టర్ తెలిపింది. తరచూ ఇలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తడం యూజర్లలో ఆందోళన కలిగిస్తోంది.

# స్టాక్ మార్కెట్ భారీగా క్రాష్

**బంగారం, వెండి కొనేందుకు పరిగెడుతున్న ఇన్వెస్టర్లు.. కారణం ఏంటంటే..**



భారతీయ ఈక్విటీ మార్కెట్ ప్రస్తుతం అత్యంత కఠినమైన దశను ఎదుర్కొంటోందని ప్రముఖ ఫిన్‌ఫ్లూయెన్సర్, విజ్డమ్ హాచ్ వ్యవస్థాపకుడు అక్షత్ శ్రీవాస్తవ వ్యాఖ్యానించారు. స్టాక్ మార్కెట్‌లో కొనసాగుతున్న అస్థిరత కారణంగా.. చాలా మంది భారతీయ పెట్టుబడిదారులు ఈక్విటీ పెట్టుబడులను తగ్గించి లేదా పూర్తిగా విడిచిపెట్టి, బంగారం వంటి సురక్షిత పెట్టుబడుల వైపు మళ్లుతున్నారని ఆయన చెప్పారు. ఇది తాత్కాలికంగా మనశ్శాంతిని ఇస్తున్నప్పటికీ.. దీర్ఘకాలంలో భారతీయ పెట్టుబడులకు ఇది మంచిది కాదని ఆయన హెచ్చరించారు. భారతీయ ఈక్విటీ మార్కెట్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న దశ.. గతంలో చూసిన అత్యంత క్రూరమైన దశలలో ఒకటిగా మారుతోందని శ్రీవాస్తవ తెలిపారు. రోజువారీ మార్కెట్ ఒడిదుడుకులు, షేర్ ధరల పతనం కారణంగా పెట్టుబడిదారుల్లో భయం పెరిగిందని, అందుకే చాలామంది ఈక్విటీలను వదిలిపెట్టి బంగారం వైపు అడుగులు వేస్తున్నారని ఆయన వివరించారు. ఈ పెట్టుబడిదారుల రాబడులు ప్రస్తుతం ఈక్విటీ పెట్టుబడిదారుల కంటే మెరుగ్గా ఉన్నాయని కూడా ఆయన చెప్పారు. ప్రత్యేకంగా లేదా భూమి వంటి ఆస్తుల్లో పెట్టుబడి పెట్టినవారు రోజూ మార్కెట్ ధరలను పరిశీలించాల్సిన అవసరం లేకుండా ప్రశాంతంగా జీవిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. వారు పని చేస్తారు, డబ్బు సంపాదిస్తారు, భూమి లేదా బంగారం కొనుగోలు చేస్తారు, ఆపై ప్రశాంతంగా నిద్రపోతారు. ఈక్విటీ పెట్టుబడిదారుల్లా ప్రతి రోజు ధరల కదలికల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం వారికి లేదని శ్రీవాస్తవ అన్నారు. మార్కెట్‌లో ఇరుక్కుపోయిన పెట్టుబడిదారులకు సహాయంగా.. ఆయన కొన్ని కీలక అంశాలను ప్రస్తావించారు. మార్కెట్లు చివరికి తిరిగి కోలుకుంటాయని, ప్రస్తుతం ఎదురవుతున్న నష్టాలు శాశ్వతం కావని ఆయన స్పష్టం చేశారు. అలాగే, నెమ్మదిగా వృద్ధి చెందుతున్న లేదా బలహీనమైన కంపెనీలను కొంతమంది పెట్టుబడిదారులు నష్టాలతో అమ్మి ఉండవచ్చని చెప్పారు. ఇది నష్టాలను అంగీకరించి ముందుకు సాగడానికి ఒక ముఖ్యమైన పాఠమని ఆయన అభిప్రాయపడ్డారు. బంగారం కొనుగోలులో భారతీయుల తెలివికి జోహార్లు.. టైటాన్ ఎండీ అజయ్ చావ్లా సంచలన వ్యాఖ్యలు.. ఈ దశాబ్దాలుగా నిజమైన పెట్టుబడి అనుభవం లేని వారికి, ఈ మార్కెట్ తిరోగమనం ఒక శిక్షణ వంటిదని ఆయన అన్నారు.మీరు అనుభవజ్ఞుడైన పెట్టుబడిదారుడిగా మారే ప్రయాణంలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మార్కెట్లు బాగా ఉన్నప్పుడు చెడు వ్యూహాలు కూడా పనిచేసినట్లు అనిపిస్తాయని, కానీ కష్టకాలంలోనే పెట్టుబడిదారులు నిజమైన పాఠాలు నేర్చుకుంటారని ఆయన వ్యాఖ్యానించారు. చివరికి, మార్కెట్‌లో చాలా మంది కథలు అమ్మడానికే ఉన్నారని పెట్టుబడిదారులు గ్రహిస్తారని కూడా ఆయన అన్నారు. మీ డబ్బును మీరు ఎలా నిర్వహించుకుంటారన్న బాధ్యత పూర్తిగా మీదే. రోజుకు 10 గంటలు డబ్బు సంపాదించడానికి కేటాయిస్తే, కనీసం ఒక గంట అయినా ఆ డబ్బును ఎలా నిర్వహించాలో నేర్చుకోవడానికి కేటాయించాలని శ్రీవాస్తవ సూచించారు. ఇదిలా ఉండగా, సోమవారం మార్కెట్లు ప్రారంభంలో మిశ్రమ సంకేతాలు ఇచ్చాయి. నిఫ్టీ 50 ఉదయం 10 గంటల సమయంలో స్వల్పంగా 0.08 శాతం పెరిగి 25,493.3 వద్ద ట్రేడ్ అయింది. అదే సమయంలో బిఎస్ఇ సెన్సెక్స్ 0.07 శాతం లాభంతో 82,685.68 వద్ద కొనసాగింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్ లాభపడగా, ఐటీ, మెటల్, కన్స్యూమర్, ఫార్మా షేర్లలో కొంత మేర కోలిక కనిపించింది. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వికె విజయకుమార్ మాట్లాడుతూ.. సమీప భవిష్యత్తులో ఐటీ రంగంలో అమ్మకాలు మార్కెట్లపై ఒత్తిడి కొనసాగించే అవకాశముందని చెప్పారు. సంస్థాగత పెట్టుబడిదారులు ఐటీ స్టాక్స్ నుంచి నిష్క్రమించి.. ఆదాయ వృద్ధి స్పష్టంగా కనిపిస్తున్న రంగాల వైపు మళ్లే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## చెల్లింపుల్లో రారాజు... యూపీఐ

**దేశంలో నగదు చెల్లింపులను అధిగమించిన యూపీఐ చెల్లింపులు**

**మొత్తం లావాదేవీల్లో 57 శాతం వాటాతో యూపీఐ అగ్రస్థానం**

**యువతలో 66 శాతం మంది యూపీఐ వైపే మొగ్గు**

**వ్యాపారుల్లో గణనీయంగా పెరిగిన డిజిటల్ చెల్లింపుల వినియోగం**

**ప్రభుత్వ ప్రోత్సాహకాలతో డిజిటల్ ఎకానమీ బలోపేతం**




భారత్‌లో చెల్లింపుల విధానంలో యూపీఐ సరికొత్త విప్లవం సృష్టించింది. నగదు లావాదేవీలను వెనక్కి నెట్టి దేశంలో అత్యంత ప్రాధాన్య చెల్లింపుల విధానంగా అవతరించింది. దేశంలోని మొత్తం లావాదేవీల్లో యూపీఐ వాటా 57 శాతానికి చేరగా, నగదు వాటా 38 శాతానికి పరిమితమైందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఒక అధ్యయనంలో వెల్లడైంది. సులభమైన వినియోగం, తక్షణమే డబ్బు బదిలీ కావడం వంటి కారణాలతో యూపీఐకి ఆదరణ విపరీతంగా పెరిగింది.“రూపే డెబిట్ కార్డ్, తక్కువ విలువ గల భీమ్-యూపీఐ లావాదేవీల ప్రోత్సాహక పథకం యొక్క సామాజిక-ఆర్థిక ప్రభావ విశ్లేషణ“ పేరుతో ఈ నివేదికను ఆర్థిక సేవల విభాగం విడుదల చేసింది. ఈ అధ్యయనం ప్రకారం, యూపీఐ వాడేవారిలో 65 శాతం మంది రోజుకు చాలాసార్లు డిజిటల్ చెల్లింపులు జరుపుతున్నారు. ముఖ్యంగా 18-25 ఏళ్ల యువతలో యూపీఐ వినియోగం 66 శాతంగా ఉంది. ఇది డిజిటల్ అలవాట్ల వైపు యువతరం ఎంతగా మొగ్గు చూపుతోందో స్పష్టం చేస్తోంది.చిన్న వ్యాపారుల్లో కూడా డిజిటల్ చెల్లింపుల స్వీకరణ భారీగా పెరిగింది. దాదాపు 94 శాతం మంది చిన్న వ్యాపారులు యూపీఐని వినియోగిస్తున్నారు. వేగవంతమైన లావాదేవీలు, సులభమైన రికార్డుల నిర్వహణ వల్ల 72 శాతం మంది వ్యాపారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఎన్‌పీసీఐ, బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థల సమన్వయంతో దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ బలోపేతమైంది. ఈ పథకం అమలు సమయంలో డిజిటల్ లావాదేవీలు దాదాపు 11 రెట్లు పెరిగాయి. యూపీఐ ప్లాట్‌ఫామ్‌పై పనిచేసే బ్యాంకుల సంఖ్య 216 నుంచి 661కి పెరగడం విశేషం. ఈ మార్పుల వల్ల ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రాలు కూడా తగ్గుముఖం పట్టాయి.

# జాబ్ పోతుందనే భయం వద్దు..

**నేర్చుకుంటే మీరే కింగ్ అవుతారు**

**టెక్ దిగ్గజాల సలహా**



ఉద్యోగాలపై కృత్రిమ మేధస్సు ప్రభావం గురించి ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్న వేళ.. భయపడాల్సిన అవసరం లేదని టెక్ దిగ్గజాధిపతులు స్పష్టంగా చెబుతున్నారు. బదులుగా, ప్రశాంతంగా ఉండి కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ ముందుకు సాగాలని వారు సూచిస్తున్నారు. యుగంలో జీవితాంతం నేర్చుకోవడం తప్పనిసరి అని.. రాబోయే 3 నుంచి 5 సంవత్సరాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఉద్యోగాల స్వభావం మారుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. న్యూఢిల్లీలో జరిగిన యుగంలో ఉపాధి భవిష్యత్తు అనే అంశంపై జరిగిన చర్చలో టెక్ పరిశ్రమకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వల్ల కొన్ని సంప్రదాయ ఉద్యోగాలు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ.. అదే సమయంలో కొత్త రకాల ఉద్యోగాలు పెద్ద సంఖ్యలో సృష్టించవచ్చని తెలిపారు. కాబట్టి ఉద్యోగులు తమ కెరీర్‌ను సురక్షితంగా ఉంచుకోవాలంటే.. ఏ నైపుణ్యాలు అవసరమో ముందుగానే అర్థం చేసుకుని వాటిని నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. (నౌక్రి.కామ్ మాతృ సంస్థ) వ్యవస్థాపకుడు మాట్లాడుతూ.. గతంలో బ్యాంకుల్లో కంప్యూటర్లు ప్రవేశపెట్టినప్పుడు కూడా ఉద్యోగాలు పోతాయని భయాలు వ్యక్తమయ్యాయని గుర్తు చేశారు. కానీ వాస్తవంగా చూస్తే ఉద్యోగాలు తగ్గలేదు. పని వేగం పెరిగింది, సామర్థ్యం మెరుగుపడింది. అదే విధంగా కూడా ఉద్యోగాలను పూర్తిగా తీసివేయదని, కానీ పనితీరును మార్చుతుందని ఆయన చెప్పారు. యువత పాలసీ స్థాయిలో ఆందోళన చెందకుండా, ఎలా ఉపయోగించుకుంటే తమ కెరీర్‌కు మేలు జరుగుతుందో ఆలోచించాలని సూచించారు. ఇంపాక్ట్ సమ్మిట్ 2026.. ప్రపంచ దేశాలకు దిక్సూచిలా మారనున్న భారత్.. రాబోయే మూడు నెలల్లో కనీసం మూడు ప్లాట్‌ఫామ్‌లు లేదా టూల్స్‌ను నేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకోవాలని భిక్‌చందాని యువతకు సూచించారు. మీరు ఎంత ఎక్కువగాను అర్థం చేసుకుంటే, అంతగా మీ ఉద్యోగ భద్రత పెరుగుతుందని అన్నారు. ఆపలేము కానీ దాన్ని నేర్చుకోకపోతే అది మనల్ని అధిగమిస్తుందని హెచ్చరించారు. కాబట్టి మారుతున్న ఉద్యోగ మార్కెట్‌లో సంబంధితంగా ఉండాలంటే సాధనాలను స్వీకరించడం తప్పనిసరి అన్నారు. ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ జునస్త్రవవవతీజవ సీఈఓ మాట్లాడుతూ.. వల్ల పని సామర్థ్యం విపరీతంగా పెరుగుతుందని తెలిపారు. అయితే ఉత్పాదకత పెరిగినా, బాధ్యత మాత్రం మానవులదే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగాలు పూర్తిగా అదృశ్యం కావు, కానీ వాటి స్వభావం మారుతుందని చెప్పారు. ఈ మార్పులకు అనుగుణంగా ఉండాలంటే జీవితాంతం నేర్చుకునే అలవాటు చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. అలాగే సంపర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఉద్యోగాలలో దాదాపు 50 శాతం వరకు ప్రభావంతో మార్పులు రావచ్చని అన్నారు. కానీ అదే స్థాయిలో కొత్త ఉద్యోగాలు కూడా సృష్టించే అవకాశం ఉందని చెప్పారు. ఈ కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే, మన రంగాల్లో అవసరమయ్యే కొత్త నైపుణ్యాలు ఏవో గుర్తించి, తిరిగి శిక్షణ పొందడం చాలా అవసరమని ఆయన సూచించారు. క్లుప్తంగా చెప్పాలంటే ఉద్యోగాలకు శత్రువు కాదని.. మార్పుకు దారితీసే శక్తిగా టెక్ నాయకులు పేర్కొంటున్నారు. భయపడకుండా, కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ ముందుకు సాగితే, యుగంలో కూడా ఉద్యోగ భద్రతతో పాటు కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని వారు స్పష్టంగా చెబుతున్నారు.



# 24 గంటలు కనిపించడం ఇష్టం లేదు

కొంతమంది సెలబ్రిటీలు ఎప్పుడూ వార్తల్లో ఉండాలనుకుంటారు. ఏదో ఒకరకంగా తమ గురించే మాట్లాడుకోవాలని, అందరి నోళ్లలో నానుతూ ఉండాలని తహతహలాడతారు.అలా పబ్లిసిటీ కోసం పీఆర్ టీమ్‌లను పెట్టుకుంటారు. కానీ తనకు అలాంటివేవీ ఇష్టం లేదని, పీఆర్ టీమ్ అసలే లేదని చెప్తోంది హీరోయిన్ శోభిత ధూళిపాళ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో శోభిత మాట్లాడుతూ.. గతంలో నేను పీఆర్ ఏజెన్సీలతో పని చేశాను. కానీ, నా వ్యక్తిత్వానికి ఆ పద్ధతులు సెట్ అవవు అని అర్థమైంది. 24 గంటలు అందరికీ కనిపించాలి, అందరూ నాకోసం మాట్లాడుకోవాలి అని నేను అనుకోవడం లేదు. అది నాకు ఏమాత్రం ఉపయోగపడదు, దానిపై నాకు ఆసక్తి అసలే లేదు. నాకు పీఆర్ లేదు, కానీ కొందరికి అది బానే పని చేస్తుంది. నేను సినీ బ్యాక్‌గ్రౌండ్ నుంచి రాలేదు, నాది ముంబై కూడా కాదు. వైజాగ్ నుంచి వచ్చి ఇండస్ట్రీలో అడుగుపెట్టిన నేను ఒక్కొక్కటిగా నేర్చుకుంటూ ముందుకు సాగాను. నాకు ఏం కావాలి? ఏం వద్దనే విషయాలపై క్లారిటీ ఉంది. రూల్స్‌తో సంబంధం లేకుండా నా దారిలో వెళ్లడమే నాకిష్టం. జనాలకు ఏదిష్టం, వాళ్లేం కోరుకుంటున్నారు? అనేది నాకు తెలియదు. కానీ నా గురించి నాకు బాగా తెలుసు అని చెప్పుకొచ్చింది. శోభిత ధూళిపాళ తెలుగమ్మాయే అయినప్పటికీ బాలీవుడ్‌లో ఎక్కువ పాపులర్ అయింది. గూఢచారి, మేజర్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు సైతం దగ్గరైంది. ఇటీవలే చీకటిలో సినిమాతో మరోసారి అలరించింది



## ఆ వీడియో నా జీవితాన్నే మార్చేసింది

సినిమా ఇండస్ట్రీలోకి కొంతమంది కుటుంబ అంగీకారంతో వస్తే, మరి కొంతమంది మాత్రం సినిమాపై ప్యాషన్ ఉండి, కుటుంబం దానిని వ్యతిరేకించిన వారి నుండి దూరమై పరిశ్రమలోకి వస్తుంటారు.కుటుంబానికి ఇష్టం లేకపోయినా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి ప్రస్తుతం తనకంటూ ఒక గుర్తింపు ఏర్పరచుకున్న ముద్దుగుమ్మలలో ఇనయా సుల్తానా ఒకరు. ఈ బ్యూటీ తెలుగు బిగ్ బాస్ కార్యక్రమంలో పార్టిసిపేట్ చేసింది. దీని ద్వారా ఈ నటి బుల్లితెర ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. ఆ తర్వాత ఈమె పలు టీవీ షోలలో కూడా పార్టిసిపేట్ చేసింది. అలాగే కొన్ని సినిమాల్లో కూడా నటించింది. తాజాగా ఇనయా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో ఈ నటి తనకు ఒక వీడియో ద్వారా అనేక కష్టాలు ఎదురయ్యాయని, ఆఖరికి దానివల్ల కుటుంబం మొత్తానికే దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేసింది. తాజాగా ఇనయా సుల్తానా మాట్లాడుతూ... “నేను పుట్టినరోజు వేడుకల్లో రామ్ గోపాల్ వర్మ గారితో కలిసి డాన్స్ చేశాను. ఆ వీడియో అంతలా వైరల్ అవుతుందని నేను అనుకోలేదు. తీరా చూస్తే ఆ తర్వాత ఆ వీడియో చాలా వైరల్ గా మారింది. దాని ప్రభావం నాపై చాలా గట్టిగా పడింది. వీడియో వైరల్ అయిన తర్వాత నా కుటుంబం నన్ను దూరం పెట్టింది. ఆ తర్వాత నా కుటుంబం మాత్రమే కాకుండా నా బంధువులు కూడా నన్ను దూరం పెట్టడం మొదలుపెట్టారు” అని ఆమె చెప్పింది.

## ఇప్పటికి 2000 ఫోక్ సాంగ్స్ చేశాను

ఫోక్ సాంగ్స్ తో మంచి గుర్తింపును సంపాదించుకున్న వారిలో జాను లిరి ఒకరు. ఈమె చాలా సంవత్సరాల నుండి ఫోక్ సాంగ్స్ లో నటిస్తూ వస్తుంది. ప్రైవేట్ సాంగ్స్ తో మంచి క్రేజ్ను సంపాదించుకున్న ఈమె ప్రస్తుతం వరుస పెట్టి ఫోక్ సాంగ్స్ చేయడమే కాకుండా టీవీ షోలలో కూడా పాల్గొంటుంది. టీవీ షోల ద్వారా ఈమె తన పాపులారిటీని మరింతగా పెంచుకుంది. అలాగే టెలివిజన్ షోల ద్వారా ఈమె బుల్లితెర అభిమానులను కూడా సంపాదించుకుంది.తాజాగా జాను ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో ఆమె తనకు సంబంధించిన కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను తెలియజేసింది. తాజాగా జాను మాట్లాడుతూ... నేను చాలా కాలం నుండి ప్రైవేట్ సాంగ్స్ చేస్తున్నాను. ఇప్పటివరకు నేను దాదాపు 2000 వరకు ఫోక్ సాంగ్స్ చేశాను. కొత్తగా కెరియర్ ప్రారంభించిన సమయంలో ఈవెంట్ కు వెళ్ళినట్లయితే ఒక్కో ఈవెంట్ కు 1000 లేదా 1500 రూపాయలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఒక్కో సాంగ్ కి 20,000 నుండి 50 వేల వరకు తీసుకుంటున్నట్లు ఆమె వెల్లడించింది. ఈ మధ్యకాలంలో అనేకమంది ఫోక్ డాన్సర్స్ సోషల్ మీడియా ద్వారా మంచి గుర్తింపును సంపాదించుకుంటున్నారు. చాలామందితో పోలిస్తే జాను ఫోక్ డాన్సర్ల విషయంలో చాలా ముందు వరుసలో ఉంది. ఈమె సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్గా ఉంటూ వస్తుంది. సోషల్ మీడియాలో కూడా జానుకి చాలామంది ఫాలోవర్స్ ఉన్నారు.





# కోట్లు ఖర్చుపెట్టినా నాకు ఇంత పబ్లిసిటీ వచ్చేది కాదు

టాలీవుడ్ ‘సీతమ్మ’గా ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మృణాల్ ఠాకూర్ పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. తనపై వస్తున్న పెళ్లి పుకార్లకు మృణాల్ ఇచ్చిన అదిరిపోయే కౌంటర్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. సాధారణంగా సెలబ్రిటీలపై పుకార్లు వస్తే వారు అసహనం వ్యక్తం చేస్తారు, కానీ మృణాల్ ఠాకూర్ మాత్రం చాలా వెరైటీగా స్పందించి అందరినీ ఆశ్చర్యపరిచింది. గత కొన్ని రోజులుగా కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్‌తో మృణాల్ ప్రేమలో ఉందని, త్వరలోనే వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని సోషల్ మీడియాలో వార్తలు జోరుగా ప్రచారమవుతున్నాయి. ఈ పుకార్లపై మృణాల్ ఇప్పటికే స్పందించినప్పటికీ పుకార్లకు చెక్ పడటం లేదు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ మరోసారి తన వ్యక్తిగత జీవితంపై పుకార్లు సృష్టిస్తూ ట్రోల్ చేస్తున్న వారికి అదిరిపోయే కౌంటర్ ఇచ్చింది. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ప్రచారాల గురించి మృణాల్ మాట్లాడుతూ.. ‘నా గురించి జరుగుతున్న ఈ ప్రచారం చూసి నేను అస్సలు విసుగు పడటం లేదు. నిజానికి నేను కోట్లు ఖర్చు పెట్టి ఒక పీఆర్ టీమ్‌ను పెట్టుకున్నా నాకు ఇంత పబ్లిసిటీ వచ్చేది కాదు. అందుకే నా గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రాస్తున్న వారందరికీ పెద్ద థ్యాంక్స్ చెబుతున్నాను” అని సెటైరికల్‌గా సమాధానమిచ్చింది. పుకార్లు సృష్టించే వారికే రిటర్న్ గిఫ్ట్ ఇచ్చినట్లుగా ఆమె చేసిన వ్యాఖ్యలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. పెళ్లి గురించి ఇంట్లో ఒత్తిడి ఉందా? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. “మా కుటుంబ సభ్యులు కూడా నన్ను నిత్యం పెళ్లి చేసుకోమని, లైఫ్‌లో సెటిల్ అవ్వమని అడుగుతుంటారు. కానీ ఒక నటిగా కెరీర్‌ను బ్యాలెన్స్ చేయడం ఎంత కష్టమో వారికి తెలుసు. ముఖ్యంగా సౌత్ సినిమాలతో పాటు హిందీ సినిమాల్లో నటించడం మామూలు విషయం కాదు.



## విశ్వక్ సేన్‌కి దెబ్బ మీద దెబ్బ.. అసలేమైంది?

గత కొన్నేళ్లుగా చూసుకుంటే తెలుగు మిడ్ రేంజ్ హీరోలకు ఎప్పటికప్పుడు డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. ప్రేక్షకుల పల్స్ వీళ్లు అర్థం చేసుకోలేకపోతున్నారా? సరైన స్టోరీలని ఎంపిక చేసుకోలేకపోతున్నారా? తెలియట్లేదు గానీ చేసిన సినిమాలు చేసినట్లు బాక్సాఫీస్ దగ్గర ఫెయిలవుతున్నాయి. ఒకవేళ సక్సెస్ అయినా సరే కలెక్షన్స్ పెద్దగా రావడం లేదు. దీనికి లేటెస్ట్ ఉదాహరణ విశ్వక్ సేన్. వరసపెట్టి మూడు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ఇంతకీ తప్పు ఎక్కడ జరుగుతోంది? ‘ఈ నగరానికి ఏమైంది?‘, ‘ఫలక్‌నుమా దాస్‘, ‘హిట్‘ లాంటి సినిమాలతో యూత్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న విశ్వక్ సేన్.. తర్వాత చేసిన ‘అశోకవనంలో అర్జున కల్యాణం‘తో నటుడిగా ఆకట్టుకున్నాడు. కానీ గత రెండు మూడేళ్లుగా చూసుకుంటే కెరీర్ ఏ మాత్రం ఆశజనకంగా లేదు. 2024లో ఏకంగా మూడు చిత్రాలతో వస్తే.. వాటిలో ‘గామి‘ ప్రయోగాత్మక చిత్రం కావడంతో జనాలకు సరిగా రీచ్ కాలేదు. ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి‘ ఓ మాదిరి రెస్పాన్స్ అందుకుంటే.. ‘మెకానిక్ రాకీ‘ ఘోరంగా దెబ్బతింది. గతేడాది ఇదే టైంకి వచ్చిన ‘లైలా‘ అయితే అల్ట్రా డిజాస్టర్. దీంతో ఏడాది గ్యాప్ తీసుకుని ‘జాతిరత్నాలు‘ దర్శకుడు అనుదీప్‌తో కలిసి ‘ఫంకీ‘ చేశాడు. ఇదీ ఇప్పుడు బాక్సాఫీస్ దగ్గర ఫెయిలైంది. ఒకప్పటితో పోలిస్తే విశ్వక్ సేన్ యాటిట్యూడ్ ఎలా తగ్గిపోయిందో.. బాక్సాఫీస్ దగ్గర అతడి సినిమాలకు ఓపెనింగ్ కలెక్షన్స్ కూడా అలానే తగ్గిపోతూ వస్తున్నాయి. ఓ రకంగా చూస్తే ఇది డేంజర్ బెల్స్ అని చెప్పొచ్చు. ప్రస్తుతం ఇతడి చేతిలో ‘ఈ నగరానికి ఏమైంది‘ సీక్వెల్, దర్శకుడిగా చేస్తున్న ‘కల్ట్‘ ఉన్నాయి. ఈ రెండింటితోనైనా విశ్వక్.. బలమైన కంబ్యాక్ ఇవ్వాల్సి ఉంటుంది. లేదంటే మాత్రం రేసులో వెనకబడిపోవడం గ్యారంటీ. విశ్వక్ సేన్ మాత్రమే కాదు టాలీవుడ్‌లో చాలామంది మిడ్ రేంజ్ హీరోల కెరీర్ దాదాపు ఇలానే ఉంది. గోపీచంద్, రవితేజ లాంటి హీరోల మార్కెట్ ఇప్పటికే చాలా పడిపోయింది. వీళ్లు సినిమాలైతే చేస్తున్నారు గానీ అటు కంటెంట్ పరంగా ఇటు మార్కెట్ పరంగా రెండూ వర్కౌట్ కావట్లేదు. వసూళ్లు కూడా పెద్దగా రావట్లేదు. సాయిధరమ్ తేజ్, సుధీర్ బాబు, శర్వానంద్, అల్లరి నరేశ్, నితిన్, వరుణ్ తేజ్, రామ్ పోతినేని లాంటి హీరోల పరిస్థితీ దాదాపు ఇంతే. పైన చెప్పిన హీరోలు.. తాము అసలు ఎలాంటి సినిమాలు చేస్తే ప్రేక్షకులు చూస్తారో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. అప్పుడో ఇప్పుడో అన్నట్లు వస్తున్నారు. కానీ సక్సెస్ అందుకోలేకపోతున్నారు. వీళ్లు కాకుండా ఉన్న మిగతా మిడ్, చిన్న రేంజ్ హీరోల పరిస్థితి అయితే అంతకంటే దారుణంగా ఉంది. ఇవన్నీ చూస్తుంటే రాబోయే రోజుల్లో పరిస్థితి ఇంకెంత ఘోరంగా ఉండబోతుందో ఏంటో అనిపిస్తోంది.


The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.